ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
3
ఆదివారం 14 జూలై 2024



బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియామకపత్రాలు అందుకుంటున్న ఉద్యోగులు

24 గంటల్లోనే పరిష్కారం

- రెండేళ్లుగా బీటీ కళాశాల ఉద్యోగుల నిరీక్షణ
- పరిష్కరించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

మదనపల్లె టౌన్, జూలై 13: మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 32 మంది ఉద్యోగుల నియామకంపై రెండేళ్లుగా పరిష్కారం కాని సమస్యను ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 24 గంటల్లోనే పరిష్కారం చూపారు. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె బీటీ కళాశాలను 2022 సంవత్సరంలో ప్రభుత్వ పరం చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ క్రమంలో అప్పటి వరకు అక్కడ పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల్సి ఉంది. కానీ వీరిలో 18 మంది అధ్యాపకులు, 14 మంది అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ ఉత్తర్వులు వెలువడినా కొందరు అడ్డుపడ్డారు. ఈ విషయమై 32 మంది పలుమార్లు వైసీపీ ప్రభుత్వ పెద్దలకు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినా 23 నెలలుగా వీరికి నియామక ఉత్తర్వులు ఇవ్వకుండా, జీతాలు చెల్లించకుండా వేధిస్తూనే వచ్చారు. దీంతో ఈనెల 11వ తేదీ 32 మంది బాధితులు వెలగపూడిలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ వద్దకు వెళ్లి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. దీనిపై విచారించిన నారా లోకేశ్ వెంటనే వీరందరికీ నియామక పత్రాలు అందించాలని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌ను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం రాత్రి 32 మంది ఉద్యోగులకు బీటీ కళాశాల సూపరింటెండెంట్ శ్రీధర్ నియామకపత్రాలు అందజేశారు. దీనిపై నియామక పత్రాలు అందించే ఫొటోను ట్యాగ్ చేస్తూ నారా లోకేశ్ తన ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 23 నెలలుగా తాము పడుతున్న అవస్థలు తెలుసుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందనపై కృతజ్ఞతలు తెలిపారు.

బాహుదాలో ఇసుక మాఫియా

- యంత్రాలతో భారీగా తవ్వకాలు
- మదనపల్లెకు టిప్పర్లతో తరలింపు
- అధికారిక రీచ్‌లు లేవు.. డంప్‌లూ లేవు





డంప్ చేసిన ఇసుక



డంప్‌లో నుంచి టిప్పర్లకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

నిమ్మనపల్లె/మదనపల్లె, జూలై 13: నిమ్మనపల్లె బాహుదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. నది పరీవాహక ప్రాంతమైన రెడ్డివారిపల్లె ఏరియాలో ఇసుక మాఫియా మాటేసింది. మూడు ఎక్స్‌కవేటర్‌లతో తవ్విన ఇసుకను మరో రెండు ఎక్స్‌కవేటర్‌లు కుప్పలుగా పోస్తుండగా ఆరు టిప్పర్లతో మదనపల్లె పట్టణం వైపు తరలిస్తున్నారు. ప్రభుత్వం ఇసుక పాలసీని ప్రకటించిందో లేదో ఇసుకాసురులు బాహుదా నదిలో మాటు వేసి వారం రోజులుగా తవ్వకాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో మదనపల్లెతో పాటు వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రకటించింది. అయితే దాని విధివిధానాలు పూర్తిగా ప్రజలకు చేరకముందే, అవి అమలు కాకముందే..వ్యాపారులు వ్యాపారం మొదలు పెట్టారు. మదనపల్లె పట్టణం గుండా ప్రవహించే బాహుదానది నిమ్మనపల్లె మండలం వరకూ విస్తరించింది. ఈ క్రమంలో అక్కడ నిర్మించిన ఆనకట్టకు నీరు చేరడాన్ని బాహుదా నదిగా పిలుస్తున్నారు. ఇందులో భాగంగా మూడు గ్రామ పంచాయతీల పరిధిలోని నీరు నిల్వ చేరడంతో పాటు ఇసుకతిన్నెలు కూడా బాగానే ఉన్నాయి. బాహుదాలో నీళ్లు ఉన్నన్నాళ్లూ ఇసుక తవ్వడానికి వీలుండదు. తర్వాత ప్రాజెక్టులోని నీటిని కిందిభాగంలో పొలాలకు వదలడంతో ఖాళీ అయిన ప్రదేశంలో ఇసుక తవ్వకాలు మొదలవుతుంటాయి. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా ఇక్కడ ఇసుక రీచ్ మొదలుపెట్టారు. ఇదేస్థాయిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. డంపింగ్ చేసి టిప్పర్లతో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలించారు. రీచ్ ప్రారంభించిన రెండు నెలలకే అప్పట్లో వర్షాలు మొదలు కావడంతో ఇసుక రీచ్ మునిగిపోయింది. తర్వాత నీళ్లు తగ్గి ఇసుక బయట పడటం, ప్రస్తుతం ఉచిత ఇసుక పాలసీ ప్రకటన రావడంతో అక్రమంగా ఇష్టానుసారం తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. బాహుదా నదిలో అర కిలోమీటరు దూరంలో మూడు ఎక్స్‌కవేటర్లు ఇసుకను తవ్వి బయట వేస్తుండగా, అక్కడున్న మరో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్లకు లోడ్ చేసి ఏర్పాటు చేసిన డంప్ ప్రాంతానికి తరలిస్తున్నారు. తర్వాత తిరిగి కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఇసుక పాలసీ ప్రకటించినా..ఇప్పటి వరకూ ఇక్కడ అధికారికంగా రీచ్‌లు, డంపులు ప్రకటించలేదు. అయితే కొందరు వ్యక్తులు ఉచితం మాటున వ్యాపారం చేస్తూ, అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటారు. బాహుదానదితో పాటు దానికి దిగువ ప్రాంతంలోని బాహుదా కాలువ, పరీవాహక ప్రాంతం గుండా వచ్చే వంకలు, వాగుల్లో తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తుండగా, ఇక్కడి నుంచి వచ్చే టిప్పర్లపై పోలీసులు నోరు మెదపడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇలా ఇక్కడ రాత్రి, పగలు అని తేడా లేకుండా టిప్పర్లు పట్టణానికి క్యూ కడుతున్నాయి.

గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఇసుక తవ్వకాలు చేపడితే, ఇప్పుడు మాత్రం నెలరోజులు కూడా గడవకముందే అక్రమార్కులు వ్యాపారం మొదలు పెట్టారని స్థానికులు నిట్టూరుస్తున్నారు. పైగా పార్టీ సింబల్ వేసుకుని తరలిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

రాయితీతో కందిపప్పు, బియ్యం పంపిణీ



కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 13: ప్రజలు నిత్యం వంటలకు ఉపయోగించే బియ్యం, కందిపప్పు ధరల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొంత తగ్గిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక సీటీఎం రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్యాలయంలో మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోనామసూరి, కందిపప్పు రాయితీ ధరలతో విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో రూ.166 ఉన్న కందిపప్పుపై కిలోకు రూ.6, కిలో రూ.54 ఉన్న సోనామసూరి బియ్యంపై కిలోకు రూ.6 రాయితీ ఇస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా కందిపప్పును కిలో రూ.160కి, సోనామసూరి బియ్యంను కిలో రూ.48కే ప్రజలకు విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు, టీడీపీ నాయకులు షంషీర్, జంగాల రమణ, శశి, పూల మురళి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేశ్



ఎంపీ సీఎం రమేశ్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఒంటిమిట్ట, జూలై 13 : ఏకశిలానగరి కోదండరాముడిని అనకాపల్లె ఎంపీ సీఎం రమేశ్ శనివారం సాయంత్రం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ముందుగా టీడీపీ నాయకుడు కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో కోదండ రామాలయం వెనుకభాగం నుంచి స్వాగతం పలికి స్వామివారి దర్శనానికి ర్యాలీగా తీసుకెళ్లారు. టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, ఇన్‌స్పెక్టర్ నవీన్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనానికి తీసుకెళ్లారు. మూలవిరాట్ అయిన సీతారామ లక్ష్మణులను దర్శించుకున్నారు. అనంతరం రంగమండపంలో ఆలయ చరిత్ర, శిలా సంపద, ఆలయ విశిష్టతను తెలుసుకుని వేదపండితుల ఆశీర్వాదం స్వీకరించారు. అనంతరం వీరికి పెద్దఎత్తున టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, రాజంపేట మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ మల్లేల శ్రీవాణి, మాజీ ఎంపీపీ ఓబినేని సుబ్బమ్మ, న్యాయవాది రామ్‌దాస్, పామూరు సుబ్రమణ్యం, రేవిళ్ల బాలమునెయ్య, మావిళ్ల ఈశ్వరయ్య, డాక్టర్ శివ, మావిళ్ల శ్రీహరి, బీజేపీ నాయకులు పాటూరు గంగిరెడ్డి, బాలరాజు శివరాజు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో అంకురార్పణ

నందలూరు, జూలై 13: మహావిష్ణువు స్వరూపుడైన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జగద్రక్షకుడైన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయని తెలపడానికి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు జరిగే ఏర్పాట్లను శ్రీవారి తరఫున ఆయన సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడు వారు సమీక్షించే కార్యక్రమాన్ని అంకురార్పణ అంటారు. అంకురార్పణకు నవధాన్యాలు, కలశ స్థాపనలు, పూర్ణకుంభ ప్రతిష్ఠ, పుణ్యాహవచనాలకు బియ్యం, నెయ్యి, బెల్లం, టెంకాయలు, తమలపాకులు సమకూర్చారు. బ్రహ్మోత్సవాలకు అర్చక స్వాములు సునీల్‌కుమార్ బృందంతో కలశ స్థాపన చేసి హోమం నిర్వహించారు. ఆలయ ఆగ్నేయ మూలలో వెలసి ఉన్న పుట్ట వద్ద పలుగు, పారలకు, పుట్టకు పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా గురు దేవతను లిఖించి ఆహ్వానించారు. పూజాది కార్యక్రమాలను పూర్తి చేసి లిఖించిన భూదేవత నుంచి కొంత పుట్ట బంగారం సేకరించి అంకురార్పణ మండపంలో ఏర్పాటు చేసిన 12 పాలికలలో పుట్ట బంగారం నుంచి అందులో నవధాన్యాలు చల్లి అంకురింపజేసే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవ వరులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ రీజనల్ ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, టీడీపీ సీనియర్ నాయకులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి వెంకటసుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్న, మోడపోతుల రాము, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



అంకురార్పణ కార్యక్రమానికి హాజరైన టీడీపీ నాయకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

నందలూరులో సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణం, తిరుమంజనం, రాత్రికి యాలి వాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

రసవత్తరంగా హాకీ పోటీలు




ఆంధ్రప్రదేశ్-కేరళ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

పులివెందుల రూరల్, జూలై 13: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీలలో జూనియర్ ఉమెన్స్ విభాగంలో కేరళ-పాండిచ్చేరి జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా 10గోల్స్ వేసి కేరళజట్టు విజయం సాధించింది. తమిళనాడు-తెలంగాణ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా 9 గోల్స్ వేసిన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్-కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 11గోల్స్ వేసిన ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. అలాగే మెన్స్ విభాగంలో తెలంగాణ-కర్ణాటక మధ్య జరగ్గా 2గోల్స్ వేసిన తెలంగాణ, తమిళనాడు-కేరళ మధ్య జరగ్గా 6 గోల్స్ వేసిన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్-పాండిచ్చేరి మధ్య జరగ్గా 5 గోల్స్ వేసిన ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బీఎం చాణిక్యరాజ్ తెలిపారు.

ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు

- కృష్ణారావు బదిలీ



విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీగా 2016 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి విద్యాసాగర్‌నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. భీమవరానికి చెందిన ఈయన తండ్రి ఉద్యోగరీత్యా రైల్వేశాఖలో పనిచేశారు. దీంతో విద్యాసాగర్‌నాయుడు విద్యాభ్యాసం తెలంగాణాలో జరిగింది. 2013లో బీటెక్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. రెండవ ప్రయత్నంలోనే 2016లో ఆలిండియా స్థాయిలో 101 ర్యాంకును సాధించారు. 24 ఏళ్ల వయస్సులోనే ఐపీఎస్‌కు ఎంపికయ్యారు తండ్రి త్యాగరాజు, తల్లి దుర్గాదేవి. ఈయన గతంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ గ్రూపు కమాండర్‌గా పనిచేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఎస్పీగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

కృష్ణారావు బదిలీ

ప్రస్తుత అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణారావు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. గత ఏడాది సెప్టెంబరు 10వ తేదీ ఈయన ఎస్పీగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. పది నెలల పాటు పనిచేసిన ఈయన ఎటువంటి వివాదాలు, ఆరోపణలు లేకుండా పనిచేశారనే చెప్పవచ్చు. శాంతిభద్రతల నిర్వహణలోనూ వివాదాలు లేకుండా పనిచేశారు.

మోదీ ప్రభుత్వ ప్రకటన హాస్యాస్పదం : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 13: ప్రధాని మోదీ ప్రభుత్వం జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినంగా గెజిట్‌లో ప్రకటించడం హాస్యాస్పదమని మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ వైఖరి దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. బయట నుంచి కానీ, లేదా అంతర్గతంగా కానీ దేశభద్రత, సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రమాదం పొంచి ఉన్నప్పుడు దేశంలో ఎమర్జెన్సీని విధించవచ్చని రాజ్యాంగంలో ఆర్టికల్ 352లో స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఆర్టికల్ ప్రకారం 1962 చైనా దురాక్రమణ సందర్భంగా, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం కారణంగా దేశంలో ఎమర్జెన్సీని విధించినట్లు తెలిపారు. పరిస్థితులు చక్కబడ్డాక ఎమర్జెన్సీ ఎత్తివేయడం జరిగిందన్నారు. కాగా మోదీ పాలనలో గత పదేళ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతుందని తెలిపారు.

విద్యా విజ్ఞాన వేదిక రుషివాటిక

- పంచముఖ, ప్రాచీన విద్యావిధానం కోసం వెలసిన గురుకులం
- కూడలి శృంగేరి పీఠం ఆశీర్వాదం.. వ్యాసభారతి ట్రస్ట్ ఆధ్వర్యం..
- బి.కొత్తకోట గట్లపై వేద విజ్ఞాన వికాస కేంద్రం
- వివిధ రాష్ట్రాల చిన్నారుల విద్యాభ్యాసం



రుషివాటిక గురుకులం ప్రధాన భవనం

బి.కొత్తకోట, జూలై 13: విద్యాలయం అనగానే వేలకు వేలు ఫీజులు, మోపెడు పుస్తకాలు, రంగురంగుల యూనిఫాం, ఆధునిక విధానాలు, కంప్యూటర్ యుగంలో రాణించాలంటూ చిన్నారుల భుజాన పెనుభారం మోపడం చూస్తుంటాం. అదేవిధంగా తల్లిదండ్రులు సైతం తమ బిడ్డ బాగా చదవాలంటూ తాహతుకు మించిన స్కూళ్లలో చేర్పించి, అధిక ఫీజులు చెల్లించి, పిల్లలను స్కూల్‌లో దింపడం, పిలుచుకురావడం లేదా స్కూల్ వ్యాన్ ప్రయాణం కూడా సహజమే. ఉపాధ్యాయులు, యాజమాన్యం సైతం పిల్లలను టాపర్స్, డల్లర్స్ అంటూ విభజించేసి విద్యావ్యాపారం చేయడం కూడా చూస్తున్నాం. అయితే ఇందుకు భిన్నంగా ఎటువంటి ఆర్భాటం, హడావిడి, ఫీజులు లేకుండా పిల్లలలో మానసిక ప్రశాంతత, భారతీయ సంస్కృతి, వేదవిజ్ఞానం, సనాతనధర్మం, నైతిక విలువలతో కూడిన విద్యావిధానాన్ని బోధించి వారిని స్వతంత్రంగా జీవించగలిగే మేధావులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్థాపించిన గురుకులమే ఈ రుషివాటిక. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని గట్లపై ఏర్పడిన ఈ గురుకులం నిజంగా ప్రత్యేకమే.

వేదవ్యాసభారతి ట్రస్ట్‌చే వ్యవస్థాపన

కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ సమీపంలో ఉన్న కూడలి శృంగేరి మహాసంస్థానం దక్షిణామ్నాయ శారదాపీఠం పీఠాధిపతి అభినవశంకర భారతి ఆశీస్సులతో ఐఏఎస్ అధికారి వేదవ్యాస్ స్థాపించిన వేదవ్యాసభారతి ట్రస్ట్‌కు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న జీఎస్ రాజు, శాంతారాణి ఈ రుషివాటిక గురుకులాన్ని స్థాపించారు. గట్లపై అనే కుగ్రామంలో విశాలమైన స్థలం, ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాల నడుమ అత్యంత సుందరంగా భవన నిర్మాణం చేశారు. విద్యార్థులు, ఆచార్యుల వసతి, తరగతి గదులు, అతిథిగృహం సమకూర్చారు. లోపలకు ప్రవేశించగానే ఆధ్యాత్మిక భావన కలిగేలా తీర్చిదిద్దారు. ఇటీవల కూడలి శృంగేరి పీఠాధిపతి అభినవశంకర భారతి స్వాముల వారు ఈ గురుకులాన్ని సందర్శించి నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.


ప్రాచీన సంప్రదాయ విద్యావిధానం

రుషివాటిక గురుకులానికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ఉండదు. ప్రభుత్వ సిలబస్ ఉండదు. పిల్లలు నేరుగా స్కూలుకు వెళ్లకుండా హోం స్కూలింగ్ విధానం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్‌ఐఓఎస్) ద్వారా సెకండరీ, సీనియర్ సెకండరీ పరీక్షలు రాస్తారు. ఆధునిక వస్త్రధారణ కాకుండా పిల్లలు, ఆచార్యులు సైతం సంప్రదాయ వస్త్రధారణలో ఉంటారు. ఉదయాత్పూర్వం యోగా, సూర్యనమస్కారాలతో దినచర్య ప్రారంభమవుతుంది. పంచకోశవృద్ధికి ఉపయోగపడే పంచముఖ విద్యావిధానంలో ఆధ్యాత్మికం, ఆదిభౌతికం, దైవికం, మానసికంతో పాటు వివిధ కళలను పిల్లలకు నేర్పిస్తారు. సంస్కృతం, మాతృభాష, పెద్దబాలశిక్ష, తిథులు, నక్షత్రాలు, వేదం, ఖగోళశాస్త్రం, జీవశాస్త్రంపై శిక్షణనిస్తారు. బానిసత్వం, సోమరితనం లేకుండా జీవనకళ, ఆత్మరక్షణకళ, లలితకళలు, వంట, శుభ్రత, దుస్తులు ఉతకడం, వ్యవసాయం, తోటపని, గోసంరక్షణ, ఆయుర్వేదంతో పాటు సంగీతం, భజన, పాటలు, నృత్యం, యోగ, ధ్యానం తదితర వాటిని సాధన చేయిస్తారు.

ట్రస్ట్ సభ్యుల పిల్లలకు అవకాశం..

పీఠాధిపతుల ఆశీస్సులతో దేశవ్యాప్తంగా ఉన్న వేల గురుకులాలలో ఇది ఒకటి. ఈ వేదవ్యాసభారతి ట్రస్ట్‌కు దేశ విదేశాలలో 3500 మందికి పైగా సభ్యులున్నారు. ట్రస్ట్ విధానాలు, ఆశయాలు నచ్చి నైతిక సంపాదన కలిగిన వారే సభ్యులుగా ఉంటారు. ఆ సభ్యుల పిల్లలకు ఇందులో ప్రవేశం ఉంటుంది. వీరిలో ఉన్నత స్థానాలలో ఉన్న వారే అధికం. అయినా వారిలా కాకుండా గురుకుల విద్య మీద ఆసక్తి చూపి తమ పిల్లలను ఈ గురుకులంలో వదిలి వెళ్లడం విశేషం. ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ, యూపీలతో పాటు విదేశాలలో స్థిరపడిన భారతీయులు రుషివాటికలో ఉన్నారు.

భారతీయ విజ్ఞానాన్ని పిల్లలకు అందించడమే లక్ష్యం



భారతీయ సంస్కృతి, సనాతనధర్మం, వేదం, గణితంలతో పాటు వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం, స్వతంత్రంగా జీవించడం, శ్రమ, దయ, విలువలు తదితర అంశాలే పాఠ్యాంశాలుగా ఉంటాయి. ప్రాచీన విద్యా విధానాన్ని పెంపొందించడమే లక్ష్యం. రుషివాటికలో పనిచేయడం ఆనందంగా ఉంది.

\- రవికుమార్ శర్మ, ప్రధానాచార్యులు



నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కూడలి శృంగేరి పీఠాధిపతి (ఫైల్)



గురుకులంలో ఉంటున్న శిష్యులు



వివిధ రాష్ట్రాలకు చెందిన శిష్యులతో ఆచార్యులు

నాగుపాముకు వైద్యం చేసిన డీడీ రంగస్వామి


పాముకు వైద్యం చేస్తున్న డాక్టర్ రంగస్వామి

కడప(రూరల్) జూలై 13: బహుళార్థ పశువైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంగస్వామి నాగుపాముకు వైద్యం చేశారు. నాగుపాము కడుపునకు పదునైన ఇనుప వస్తువు తగిలి పేగులు బయటికి వచ్చాయి. విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. దీంతో డీడీ పేగులను తిరిగి పొట్టలోకి పంపించి కుట్లువేశారన్నారు. ఏడీలు చాంద్ బాషా, నేతాజీ, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ నంద్యాల రాజశేఖర్, డాక్టర్ సుబ్బరాయుడు, వీఏఎస్‌లు శివలక్ష్మి, వీఎల్‌ఓ షాహిదా బేగం తదితరులు వైద్యం చేయడంలో సహాయం అందించారన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై వేడి నూనెతో దాడి

ఒంటిమిట్ట, జూలై 13: పెన్నపేరూరులో కదిరి ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన గజ్జల సుబ్బారెడ్డి వేడి నూనె పోసి దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు పక్క ఊరిలోని ప్రభాకర్ బంధువు చనిపోతే అంత్యక్రియలకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు గ్రామంలోని ఓ ఇంటి అరుగుమీద పడుకుని ఉండగా ఆ ఇంటివారు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పగా ఆయన వెళ్లలేదు. దీంతో వారు వేడివేడి నూనెను వేయడంతో వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి ఉదయం చూస్తే శరీరంపై బొబ్బలు రావడంతో కుటుంబ సభ్యులకు తెలపగా చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన కదిరి ప్రభాకర్ ఎస్సీ సామాజిక వర్గీయుడు కావడంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి, సీఐ పురుషోత్తమరాజు ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయి

ఆర్టీసీ జోన్-4 ఉద్యోగుల క్రీడల ప్రారంభోత్సవంలో ఈడీ


నడక పోటీల్లో ఆర్టీసీ ఈడీ, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్

కడప (స్పోర్ట్స్) జూలై 13: ఉద్యోగుల మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నిత్యం ఆఫీసులో ఫైళ్లతో తలమునకలౌతూ సేవలందించే ఉద్యోగులకు క్రీడలు కాసింత సేద తీర్చగలిగే ఉత్సాహాన్ని ఇవ్వగలవన్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్‌ఆర్‌టీయూ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సారథ్యంలో శనివారం రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో ఆల్ ఇండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మీట్ (మహిళలు-పురుషులు) క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వరరావు, కడప ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. ఉద్యోగుల దైనందిన జీవితం కత్తిమీద సాములా వుంటుందన్నారు. వారంతంలో అయినా కాసింత ఆటవిడుపు కోసం ఉద్యోగులు తేలికపాటి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తద్వారా ఆరోగ్యం, ఆయుష్షు పొందగలరన్నారు. తదనంతరం జోన్-4 (కడప-కర్నూలు-చిత్తూరు-అనంతపురం) జిల్లాల నుంచి హాజరైన 164 మంది ఆర్టీసీ ఉద్యోగులకు 100, 400, 800, 1500 మీటర్స్ (పురుషులకు) పరుగుపందెం పోటీలు, 400 మీటర్స్ నడక (50 సంవత్సరాలు పైబడిన ఆఫీసర్స్‌కు) పోటీలు, ఇందులో కడప ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ సూపరింటెండ్ శ్రీకాంత్ ప్రథమరెడ్డి ప్రథమ విజేతగా, ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి. గోపాల్‌రెడ్డి ద్వితీయ విజేతగా నిలిచారు. జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో పలువురు మహిళా-పురుష ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, డిప్యూటీ సీటీఎం హరి, కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి, ఉద్యోగులు గోరవర్ధన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బిడ్డలకు అండగా ఉంటాము : ఎమ్మెల్యే

- ఆరు లక్షల రూపాయలు పిల్లల పేర డిపాజిట్


ఎమ్మెల్యే పుట్టా నుంచి బాండ్లు ఇస్తున్న దృశ్యం

మైదుకూరు రూరల్ జూలై 13: తల్లిదండ్రులు ఇద్దరూ ఒకే నెలలో మృతి చెందడంతో అనాథలుగా మారిన చిన్నారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రకటించారు. టీడీపీ యువనేత, న్యాయవాది యాపరాల చిన్న, శ్రీనివాసులు(వాసు) పిల్లల భవిష్యత్‌ను బాధ్యతగా తీసుకుని వచ్చిన డబ్బును పిల్లలకు ఆరు లక్షల రూపాయలను ఫిక్సడ్ డిపాజిట్ చేసి ఎమ్మెల్యే ద్వారా వారి మేనత్తకు అందించారు. పాతూరులో యాంగటి రమాదేవి జూన్ 15వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించింది. ఆమె భర్త యాగంటి ఈశ్వర్ గుండెనొప్పితో మరణించాడు. ఒకే నెలలో తల్లిదండ్రులను కోల్పోయి వారి ముగ్గురు పిల్లలు అనాథలవడంతో పాతూ రంతా చలించింది. ఈ హృదయ విదారక సంఘటనను ఆంధ్రజ్యోతిలో 'మేమేం పాపం చేశాం..' అంటూ కథనం ప్రచురితమైంది. దీంతో దాతలు వెల్లువలా పిల్లల భవిష్యత్‌కు డబ్బును విరాళాలుగా ఇచ్చారు. 8వ తరగతి చదువుతున్న వాసంతికి కస్తూర్బా స్కూల్‌లో ఎమ్మెల్యే సీటు ఇప్పించారు. పిల్లల ఆలనా పాలన చూసే మేనత్తకు ఉద్యోగం ఇప్పిస్తానని మాట ఇచ్చారు. పిల్లల విషయంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నా దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

సమస్యల వలయాలు

శిథిలావస్థలో విద్యుత్ భవనాలు ● పెచ్చులూడిన పైకప్పు ● నెర్రలు చీలిన గోడలు ● ఇబ్బందుల్లో సిబ్బంది ● మున్సిపాలిటీ బకాయి రూ.1.93 కోట్లు


నిరుపయోగంగా ఉన్న విద్యుత్తు కార్యాలయ భవనాలు

జమ్మలమడుగు, జూలై 13: స్థానిక విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఆవరణంలోకి వెళ్లేందుకు గేటు మొదలు గుంతల మయమైన రోడ్డుతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయి. సబ్‌డివిజన్ కార్యాలయం మాత్రం అంతంత మాత్రమే. దాని పక్కనే సిబ్బంది, బిల్లులు చెల్లింపు గదులు దారుణంగా తయారయ్యాయి. పైకప్పులు పెచ్చులూడడంతో కడ్డీలు దర్శనమిస్తున్నాయి. విద్యుత్తు భవనాలు పడిపోయే దిశలో ఉన్నట్లు సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నా కార్యాలయ భవనాలు మాత్రం నిర్మించలేకున్నారు. సమస్య ఉన్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. విద్యుత్తు సామగ్రిపెట్టుకునే గదులు మరింత దారుణంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా కార్యాలయ ఆవరణలోకి పైకప్పుగుండా వర్షపునీరు చేరుతోంది. ఆవరణలో వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా మారింది.

బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారు

జమ్మలమడుగులో విద్యుత్తు వినియోగదారులు చేనేత కార్మికులు, ఇతర వ్యాపారులు విద్యుత్తు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. బిల్లులు చెల్లించే గది వద్ద వినియోగదారులు క్యూ కట్టారు. వినియోగదారులకు మంచినీటి వసతి కల్పించాల్సి ఉంది. అధికారులు విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని బీసీ కాలనీలో తాడిపత్రి రోడ్డులోని మరికొందరు కార్యాలయంలోని అధికారులు సంప్రదించి బిల్లులు అధికంగా వచ్చాయని తెలియజేశారు. ఇదే విషయాన్ని విద్యుత్తు డీఈ రాజగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు.

మున్సిపాలిటీలో బిల్లుల పెండింగ్

జమ్మలమడుగు మున్సిపాలిటీలో బిల్లులు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో వాటర్‌ప్లాంట్ల నుంచి బిందె లేక, క్యాన్ నీటిని రూ.3కే ప్రజలకు అందించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం కరెంటు బిల్లులు మున్సిపాలిటీకే సంబంధించిందని, కేవలం ప్రజలకు మాత్రం తక్కువ ధరకు నీళ్లు అందించాలని ఏర్పాటు చేశారు. అయితే పట్టణంలోని కొన్ని వాటర్‌ప్లాంట్లు గతంలోనే మూతపడ్డాయి. మరికొన్ని చోట్ల వాటర్‌ప్లాంట్లు కొనసాగించినా విద్యుత్తు బిల్లులు పెండింగ్ పడ్డాయి. వాటర్‌ప్లాంట్ల యజమానులు విద్యుత్తు బిల్లులు చెల్లిస్తామని ప్రస్తుతం తమకే వాటర్‌ప్లాంట్లు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. గత నెలలో మున్సిపల్ అధికారులు వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేసి విద్యుత్తు బిల్లులు పెండింగ్ ఉన్నాయని, ఇతర సమస్యలపై వాటర్‌ప్లాంట్లను సీజ్ చేశారు. మళ్లీ మున్సిపల్ సిబ్బందితోనే ఆ ప్లాంట్లను కొనసాగిస్తున్నారు. ఏదేమైనా జమ్మలమడుగు మున్సిపాలిటీలో విద్యుత్తు బిల్లుల విషయంలో దాదాపు రూ.2 కోట్లు పెండింగ్ ఉన్నట్లుగా తెలిసింది.

విద్యుత్తు ఏఈల కొరత

జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలో గతేడాదిగా మండలాలకు విద్యుత్తు ఏఈలు ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతోంది. దీంతో ఆయా మండలాల్లో రెగ్యులర్ విద్యుత్తు ఏఈలు లేకపోవడం వలన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అన్ని గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు, స్తంభాల సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరతతో ఇబ్బందులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. సబ్‌డివిజన్ పరిధిలో జమ్మలమడుగు రూరల్ పరిధి, మైలవరం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో ఇన్‌చార్జి ఏఈలు ఉన్నారు. సిబ్బంది కొరత వలన సమస్యలున్నాయి. ఈ సమస్యలపై డీఈ రాజగోపాల్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్తు బిల్లుల బకాయిలు మొత్తం రూ.1.93 కోట్లు ఉందని తెలిపారు. ఆ తర్వాత మళ్లీ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు సంబంధించిన విద్యుత్తు సమస్యలు ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో ముద్దనూరు మండలంలో మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వ్యవసాయానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో ఇటీవలే సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు.


ప్రధాన గేటు వద్ద రోడ్డు దారుణం


నెర్రలు చీలిన విద్యుత్తు కార్యాలయ గోడలు



లోపలి భాగంలో పైకప్పు దెబ్బతిని కడ్డీలు దర్శనం

పంచాయతీల బలోపేతానికి సీఎం కృషి

పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరెడ్డి


సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మునిరెడ్డి

కడప(రూరల్) జూలై 13: గతంలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 250 కోట్లు పంచాయతీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చాంబర్ ప్రతినిధులు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 14, 15 ఆర్థిక సంఘాల నుంచి పంచాయతీలకు వచ్చిన వేలకోట్ల నిధులను దారిమళ్లించి గ్రామ పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. ఈ మేరకు వైసీపీని ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామీణ ప్రాంత ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాకముందే 12918 పంచాయతీలకు రూ. 250 కోట్లు నిధులను విడుదల చేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు మూడున్నరకోట్ల గ్రామీణ ప్రజల తరుపున ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ సీఎం చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు.

అంజన్న దర్శనానికి తరలివచ్చిన భక్తజనం


హరికథా కాలక్షేపం వింటున్న భక్తులు

చక్రాయపేట,జూలై 13: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి దర్శనానికి భారీఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. స్పెషల్ దర్శనం, వీఐపీ దర్శనం, సర్వదర్శనం లైన్లు కిక్కిరిశాయి. వచ్చిన భక్తులకు ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ తీర్థప్రసాదాలు నొసంగారు. లడ్లు అయిపోవడంతో మళ్లీ తయారు చేయించారు. గండి దేవస్థానంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పులిహోర ప్యాకెట్లను రూ.10కే అందించండంతో దాదాపు 800ప్యాకెట్లు అయిపోయాయి. ఈ వారం తాత్కాలికంగా ప్రవేశపెట్టడంతో భక్తులకు తగినన్ని లభించలేకపోయాయి. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది నుంచి ఉదయం గుడి తలుపులు తెరవగానే గోపూజ చేసి తలుపులు తెరుస్తున్నారు. రెండో శనివారం సెలవు ఉండడంతో గండికి చేరుకున్నారు.

ఇంటిపై నుంచి పడి కూలీ మృతి

కడప (క్రైం), జూలై 13: లోహియానగర్‌లో సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు చెర్లోపల్లె ప్రసాద్ (50) ఇంటిపై నుంచి పడి కూలీ చనిపోయినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. సీకేదిన్నె మండలం తాడిగొట్ల వాసి చెర్లోపల్లె ప్రసాద్ శనివారం లోహియానగర్‌లో అస్లాంబాష ఇంటిపైన సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని జింక మృతి

ములకలచెరువు, జూలై 13: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందినట్లు అటవీ అధికారులు తెలిపారు. పీటీఎం రోడ్డులోని నాయనిచెరువుపల్లె సత్రం వద్ద రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో జింక తీవ్రంగా గాయపడడంతో గమనించిన మధు అటవీ అధికారులకు తెలియజేశారు. సిబ్బంది చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందింది. జింక కళేబరాన్ని అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్)జూలై 13: కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం 17.9.2023 నుంచి ప్రారంభించారు. ఇందులో 18 రకాల కులవృత్తులవారు లబ్ధిపొందవచ్చని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సచివాలయం, గ్రామ స్థాయిలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. చర్మకారులు, చెప్పులు కుట్టువారు, రజకులు, దర్జీలు, మత్స్యకారులు, కళాకారులు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, క్షరకులు, తాపీమేస్త్రీ, శిల్పకళాకారులు నమోదు చేసుకోవచ్చన్నారు. పూర్వీకుల నుంచి కుటుంబ వృత్తిగా చేస్తున్న వారు అర్హులు. లబ్ధిదారులు ఎలాంటి రుణాలు పొంది వుండకూడదు. ఒకరికే నమోదుకు అర్హులు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర, కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోగలరు.

తిరుపతిలో కడప మహిళ దారుణహత్య

- గొంతుకోసిన గుర్తు తెలియని వ్యక్తి



తిరుపతి రూరల్, జూలై 13: కడప జిల్లాకు చెందిన మహిళ ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ(58) తిరుపతి జిల్లాలో దారుణహత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట వాసి భూమిరెడ్డి బాలిరెడ్డి భార్య ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ, కుమార్తె గుర్రమ్మతో కలసి బతుకుదెరువు నిమిత్తం సుమారు 30 ఏళ్ల కిందట తిరుపతికి వచ్చారు. గుర్రమ్మకు కంటిచూపు సరిగా కనిపించక పోవడం, మానసిక పరిస్థితి సరిగా లేదు. దాదాపు పదేళ్ల కిందట తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో తిరుపతి వాసి బి.మాలతి స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో శ్రీబాలాజి పార్కింగ్ యార్డ్ పేరిట ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్‌చేసి వారి నుంచి ఫీజు వసూలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాలిరెడ్డి వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి ఈనెల ఒకటో తేదీన కుమార్తెతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. కుమార్తె ఈనెల 8న తిరుపతికి రాగా, సొంతపనుల నిమిత్తం బాలిరెడ్డి స్వగ్రామంలోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం దాదాపు 5.30గంటలకు కుమార్తె స్నానం చేయడానికి వేడినీరు పెట్టడానికి తల్లి రెడ్డెమ్మ సిద్ధమవుతోంది. ఈసమయంలో బ్లూషర్ట్ ధరించి ఉన్న వ్యక్తి గోడదూకి ఇంట్లోకి వచ్చి కుమార్తె గొంతు పట్టుకోవడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తల్లి రావడంతో ఆ వ్యక్తి తన చేతిలో కత్తితో ఆమె గొంతు కోసి గోడదూకి పరారయ్యాడు. కొంతసేపటికి గుర్రమ్మ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం వద్దకొచ్చి తన తల్లి చనిపోయిందని చెప్పింది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదన్న కారణంతో దుకాణ నిర్వాహకురాలు రాధమ్మ పెద్దగా పట్టించుకోలేదు. అయితే గుర్రమ్మ ఏడుస్తూ ఎంతకూ అక్కడినుంచి వెళ్లకపోవడంతో అటుగా వెళుతున్న పారిశుధ్య కార్మికుడికి విషయం చెప్పింది. తర్వాత ముగ్గురూ కలిసి రెడ్డెమ్మ ఇంటికెళ్లారు. గేటు తాళం వేసి ఉండడంతో ఎలా బయటకు వచ్చావని గుర్రమ్మను ప్రశ్నిస్తే.. గేటు ఎక్కి దూకానని చెప్పింది. తాళం ఎక్కడుందని అడిగితే గేటు ఎక్కి లోపలికెళ్లి తీసుకొచ్చింది. గేటు తాళం తీసి ఇంటి లోపలకు చూడగా.. రెడ్డెమ్మ రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉంది. భయపడి వారు వెనక్కి వచ్చేశారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి గంగిరెద్దులకాలనీ వరకు వచ్చి ఆగిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి వస్తువులు బయటపడినట్లు సమాచారం.

అమ్మ చనిపోయింది.. చైనూ ఎత్తుకెళ్లారు

అమ్మా చనిపోయింది.. తన మెడలోని చైనూ ఎత్తుకెళ్లారు అంటూ శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గేటు బయట రోడ్డుపై కూర్చుని విలపిస్తున్న గుర్రమ్మను చూసిన వారంతా కంటతడి పెట్టారు.

బండకింద తండాలో 10 జీవాలు మృతి

పెద్దమండ్యం, జూలై 13: జీవాలు బలంగా పెరగడం కోసం తాగించే పెరుగు మందుని పొరపాటున పొలాల్లో గడ్డి నివారణ మందు తాగించడంతో 10 గొర్రెలు మృత్యువాత పడినట్లు పెద్దమండ్యం పశు వైద్యాధికారి ఉస్మాన్ వెల్లడించారు. రామానాయక్ తండా పంచాయతీ బండకింద తండా వాసులు బొడ్డు నాయక్, రమేష్ నాయక్ గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి మం దలోని 4 గొర్రెలు ఆకస్మికంగా మృత్యువాత పడగా కడుపు ఉబ్బరం, కాళ్లు విదిలిస్తూ మ రో ఏడు గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న వెటర్నరీ డాక్టర్ ఉస్మాన్ మిగిలిన గొర్రెలకు వైద్యసేవలందించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ములకలచెరువు, జూలై 13: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు... బురకాయల కోట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మధ్యాహ్నం రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కుడి ఛాతిపై కాలిన గాయం, బ్లూ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని, బంధువులు, కుటుంబీకులు గమనిస్తే తమకు సమాచారం అందజేయాలని కదిరి రైల్వే ఎస్ఐ ఇబ్రహీం తెలిపారు.

వైభవంగా మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, జూలై 13: ధర్మపథం సమూహాలయంలో శనివారం ఆలయ ప్రాంగణంలోని శనేశ్వర స్వామికి మహాతైలాభిషేకం జరిగింది. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్న వితరణ చేపట్టారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

పిచ్చలవాండ్లపల్లె వద్ద ఇసుక నిల్వలు స్వాధీనం

కురబలకోట, జులై 13: మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ సమీపంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రెవెన్యూ, పోలీసులు అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్ళి తనిఖీ చేపట్టారు. ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణం కోసం భారీ స్థాయిలో ఇసుకను నిల్వ ఉంచారు. దీంతో అక్కడ ఉన్న నిల్వలను, అక్కడ భారీస్థాయిలో ఇసుక గుట్టల నిల్వలను గుర్తించారు. ఆ ఇసుకకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో నివేదికలను కలెక్టర్‌కు పంపించనున్నట్లు డీటీ నవీన్‌తాజ్ పేర్కొన్నారు. కాగా వాటికి సంబంధించి గనుల, భూగర్భ శాఖాధికారులు రెండు రోజుల్లో ఇక్కడికి వచ్చి నిల్వలు సంబంధించి అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

కంబాలకుంటలో గంగమ్మ జాతర ప్రారంభం

పెనగలూరు, జూలై 13 : మం డలంలోని కంబాలకుంట బీసీ కాలనీలో శనివారం నుంచి గం గమ్మ జాతర ప్రారంభమైంది. గ్రామ పెద్దలు, యువకులు ఆ. ధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం నెల్లూరు కళాకారులు ప్రదర్శించిన కోలాటం, నృత్య ప్రదర్శన ఆకట్టుకొంది. సాయంత్రం బలిపోతు పోతుల రాజు గ్రామోత్సవం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రజలు పసుపునీరు, కాయ కర్పూరం సమర్పించు కున్నారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి ఆసాది కథ ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. పొంగళ్లు తరువాత జాతర జరుగుతుందని తెలిపారు.

ముక్కాను కలిసిన టూరిజం అధికారి

ఓబులవారిపల్లె, జూలై 13 : రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని టూరిజం జిల్లా అధికారి ఎం.నాగభూషణం తదితరులు మర్యాద పూర్వ కంగా కలిశారు. బాలిరెడ్డిపల్లె మాజీ ఎంపీటీసీ సభ్యుడు మురాముట్ల గురుప్రసాద్, టీడీపీ నాయకులు ఉమ్మల రాజు సుబ్బరాజు మండలంలోని పలు సమస్యలపై ఆ యనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి సు కుమార్ రెడ్డి, సాలవా రమణరాజు పాల్గొ న్నారు.

ముగిసిన ప్రసన్న ఆంజనేయస్వామి తిరుణాల

సుండుపల్లె, జూలై 13: మండ లంలోని పింఛా ప్రాజెక్టుపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మూ డు రోజుల నుంచి భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. తిరుణాల ము గింపు సందర్భంగా చాందినీ బండ్లతో ప్రదక్షిణలు చేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

లక్కిరెడ్డిపల్లె, జూలై 13: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి సయ్యద్ మహ్మద్ అక్రమ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ పాఠశాల 2013లో ప్రారంభం కాగా ఇప్పటివరకు ఐదుగురు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యార న్నారు. ఎంపికైన విద్యార్థిని వైఎస్ ప్రిన్సిపాల్ నాగయ్య సిబ్బంది తదిత రులు అభినందించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

● డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆందోళన

రాయచోటిటౌన్, జూలై 13: గత ప్రభుత్వం ఎటువంటి విధి విధానాలు రూపొందించకుండా జీవో 54 ప్రకారం జీపీఎస్ అమలు చేస్తూ నిన్నటి రోజున విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ డిమాండ్ చేశారు. జీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో శనివారం సాయంత్రం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద గెజిట్ నోటిపికేషన్ ప్రతులను దహనం చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన రోజున వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసి జీపీఎస్ అనే దిక్కుమాలిన విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉన్న సందర్భంలో ఈ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు షాక్‌కు గురయ్యారని, వెంటనే ఈ నోటిఫికేసన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంత రం పీఈటీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ 2003 డీఎస్సీతోపాటు, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, సభ్యుడు ప్రసాద్,



జీపీఎస్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సహాధ్యక్షుడు కిపాయితుల్లా, రెడ్డిముని, సుధాకర్, రాయచోటి మండల ప్రధానకార్యదర్శి రాజారమేశ్, సహాధ్యక్షుడు రెడ్డిబసయ్య, ట్రెజరర్ రఫీఖాన్, సుండుపల్లె మండల నాయకులు శశికిరణ్, వీరబల్లి మండల అధ్యక్షుడు నాగార్జున, గుర్రంకొండ మండల నాయకులు నరసింహారెడ్డి, శశిభూషణ్, పెద్దమండెం మండలం నాయకులు చలపతి, రాజేంద్ర, గఫార్‌ఖాన్, రాజబాబు, హిమాయుద్దీన్, ఇనాముల, షబ్బీర్, వరప్రసాద్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలి

రాజంపేట, జూలై 13 : వైసీపీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. శనివారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పెద్ద హిందూ ధార్మిక సంస్థ అయిన తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మంటగలిపి, వైసీపీ వ్యాపార సంస్థగా మార్చేశారని ఆరోపించారు. గత ఈవో ధర్మారెడ్డి, చిత్తూరు జిలాకు చెందిన వైసీపీ మంత్రులు కలిసి ప్రొటోకాల్ దర్శనాలను కూడా తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారన్నారు. లడ్డూ తయారీ ముడి సరకులు, అతిథి గృహాల నిర్మాణాలు, దుకాణాల లైసెన్సుల రెన్యువల్, బ్యాంకు డిపాజిట్‌లు, శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు దుర్వినియోగంపై



మాట్లాడుతున్న పోతుగుంట రమేష్‌నాయుడు

పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో తిరిగి టీటీడీ పవిత్రతను పెంచి హిందూ ధార్మిక భావాలకు విలువ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినారాయణ, పాపయ్య, రమణ, సూర్యచంద్ర, హరిప్రసాద్, తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా దళితుల సమస్యలు మారలేదు

రైల్వేకోడూరు(రూరల్) జూలై 13: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా దళితులు సమస్యలు మారలేదని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో రేపూరి శంకరయ్య ఆధ్వర్యంలో కోడూరు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అవకతకులపై సమగ్ర చట్టం తీసుకురావాలని, ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు ఆక్రమించుకున్న ప్రభుత్వ బంజరు భూములను గుర్తించి నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం కోడూరు ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, బీకేఎంయూ నాయకులు తిప్పన ప్రసాద్, నియోజకవర్గ మండలాల అధ్యక్షులు,



సమావేశంలో పాల్గొన్న బీకేఎంయూ నాయకులు

కార్యదర్శులు, హజమా బీ, వినయ్, శివ, కృష్ణయ్య, జయరామయ్య, ఇంద్రమ్మ, నిర్మల, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమ్మేళనం సభను జయప్రదం చేయండి..

రైల్వేకోడూరు(రూరల్) జూలై 13: ఈ నెల 29 మదనపల్లెలో జరిగే రైతు సమ్మేళనం సభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు డి. రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం పట్ట ణంలోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు విధానాల కారణంగా కౌలు రైతు లు, గ్రామీణ చేతివృత్తిదారుల స్థితిగతులు రోజు రోజుకు దిగజారుతున్నాయని, రైతాంగంపై వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, పార్లమెంటరీ నియమాలను ఉల్లంఘించి తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధరలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ పాల్గొన్నారు.

కాకతీయ అన్నదాన ట్రస్టు చైర్మన్‌గా లక్ష్మీనారాయణ

రాజంపేట, జూలై 13 : పెంచలకోన కాకతీయ అన్నదాన సేవాసంస్థ అధ్యక్షుడుగా రాజంపేటకు చెందిన టి. లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శనివారం కాకతీయ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకతీయ సేవా సమితి సభ్యులు ఈ ఎన్నికలో పాల్గొన్నారు. వ్యవస్థాపకులు సుబ్బరామనాయుడు, కార్యదర్శి రామచంద్రనాయుడు, ఉపాధ్యక్షుడు బుజ్జిబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ నిత్యాన్నదానానికి కృషి చేస్తానన్నారు.



నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న కాకతీయ సేవాసమితి సభ్యులు

వైద్య ఖర్చులకు జనసేన, ఎన్ఆర్ఐల సాయం

చిట్వేలి, జూలై 13 : మండల పరిధిలోని తిమ్మాయపాళెం పంచాయతి గట్టుమీద ఎల్లెకు చెందిన అద్దంకి సురేష్ కిడ్నీ సమస్య తలెత్తడంతో తిరుపతి లోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానికులు తిమ్మాయపాళెం కువైట్ ఎన్ఆర్ఐలకు పరిస్థితి వివరించగా స్పందించిన తిమ్మాయ పాలెంకు చెందిన సింగార సుబ్రమణ్యం, పురం సురేష్, జనసేన టీం సభ్యులు 50 వేల నగదును పోగు చేశారు. ఈ మొత్తాన్ని శనివారం రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ, మండల జనసేన నాయకులు మాదాసు నరసింహ సురేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివప్రసాద్ రాజు, చెంగల్ రాయుడు, మాదాసు శివ, అవినాష్, మన్మథ, నాగేష్, రమణయ్య, గోపాల్, మన్నూరు వెంకటేశ్, మల్లికార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నగదు అందిస్తున్న గుత్తి నరసింహ, మాదాసు నరసింహ తదితరులు

త్వరలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలు

రాయచోటిటౌన్, జూలై13: రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం ఏపీయూడబ్ల్యూజే అని, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న సంఘానికి మద్దతుగా ప్రతి జర్నలిస్టు నిలవాలని ఏపీయూడబ్ల్యూజే కడప జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో మహాసభల నిర్వహణకు తేదీని ఖరారు చేయనున్న నేపథ్యంలో శనివారం రాయచోటి పట్టణంలో సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీల ఏర్పాటు విషయాలపై చర్చించారు. ఈ సమావేశానికి రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు పాత్రికేయులు హాజరయ్యారు.



ఏపీయూడబ్ల్యూజే సన్నాహక కార్యక్రమంలో జిల్లాలోని పలు నియోజకవర్గాల జర్నలిస్టులు

'మానవత' కార్యవర్గం ప్రమాణస్వీకారం

రాజంపేట టౌన్, జూలై 13 : పట్టణంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. సంస్థ కేంద్ర నియంత్రణ డైరెక్టర్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బి. శ్రీనివాసులు. ఉపాధ్యక్షుడుగా బి.వేణుగోపాల్, కార్యదర్శిగా వై.నందకిషోర్, కోశాధికారిగా బి.రామచంద్రనాయుడు, జాయింట్ సెక్రెటరీగా వై.కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఈసీ అవేర్‌నెస్ కమిటీ సభ్యులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, ఈసీ హెల్ప్ కమిటీ సభ్యులుగా నాగరాజు, ఎడ్యుకేషన్ సభ్యులుగా మూర్తి, ఎమర్జెన్సీ సభ్యులుగా కె.సుబ్బరామిరెడ్డిని ఎన్నుకున్నారు. అడ్వైజర్లుగా చీనేపల్లి చెంగయ్య, బద్వేలు సుబ్బరాయుడు, అరవ రమణయ్య, వైవీ నాగేంద్రనాయక్, దగ్గుపాటి హరిగోపాల్ నాయుడు,



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సంస్థ కార్యవర్గ సభ్యులు

చెంగారావు, గంగనపల్లె వెంకటరమణ, ఎస్.చంగల్‌రాజు, చంద్రనాయుడులను ఎంపిక చేశారు.

బోగస్ సర్టిఫికెట్లను ఏరివేయాలి

రాయచోటి టౌన్, జూలై 13: మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సంబంధించిన బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకోవాలని, 2002 డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. బోగస్ సర్టిఫికెట్లు సత్వరం ఏరివేయాలని, అదే సమయంలో జెన్యూన్ సర్టిఫికెట్‌దారులను రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు. అక్రమార్జన లక్ష్యంగా పనిచేస్తున్న అధికారుల నుంచి నిజాయితీ పరులైన అధికారులను కాపాడాలని కోరారు.

బేబి హాస్పిటల్‌లో అత్యాధునిక కీళ్లమార్పిడి శస్త్రచికిత్స

కడప(సెవెన్‌రోడ్స్), జూలై 13: బేబి హాస్పిటల్‌లో అత్యాధునిక కీళ్లమార్పిడి శస్త్రచికిత్స చేస్తున్నట్లు ప్రముఖ కీళ్ల మార్పిడి, కీహోల్ సర్జన్ డాక్టర్ జహంగీర్‌బాషా పేర్కొన్నారు. శనివారం కడపలోని జేబీ హాస్పిటల్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరప్ దేశమైన స్పెయిన్‌లో ఏట సంస్థ తనకు ఆహ్వానం పలికి అందులో ట్రైనింగ్ ఇప్పించి ప్రావీణ్యం పొందేలా చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. అక్కడున్న పరికరాలు, పద్ధతులు భారతదేశంలో అతి తక్కువ ఆసుపత్రిలో మాత్రమే లభిస్తాయని, అటువంటి పద్ధతులు, చికిత్సలు ఇప్పుడు జేబి హాస్పిటల్‌లో ప్రారంభించామన్నారు. ముఖ్యంగా రివిజన్, ప్రైమరీ కీళ్ల మార్పిడిలో అతి తక్కువ ఎముకను కట్ చేయడం, తక్కువ రక్తస్రావం, తక్కువ ఇన్‌ఫెక్షన్ రేటు ఫాస్ట్ రికవరీ ఉంటుం దన్నారు. ఈ ఆపరేషన్లు తమ వద్ద ఉన్న జాన్సన్ అండ్ జాన్సన్ వారి రోబో ద్వారా సాధ్యపడుతుందన్నారు. ఇప్పటికే ఆ పద్ధతి ద్వారా 1వ తేది నుంచి ఇప్పటి వరకు 20 మందికి కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేసి విజయవంతంగా నడిపించడం తమకు సంతోషంగా ఉందని మత్తుమందు డాక్టర్, హాస్పిటల్ సీఈఓ డాక్టర్ జయభారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్‌బాషా, చిత్రంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వెంకటేశ్వర్లు

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

రాయచోటిటౌన్, జూలై 13: గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే వారు ఏం తిని బతకాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్రుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారులకు తెలియజేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, ఇచ్చే అరకొర వేతనం నెలల తరబడి ఇవ్వకపోతే గడ్డి తిని బతకాలా అని ఆయన జిల్లా పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వం క్లాప్ మిత్రల సమస్యలు పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, రమణయ్య, వెంకట్రమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

గాలివీడు, జూలై 13: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం హర్షణీయమని పూలుకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో పలువురు టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేయక నిర్వీర్యం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేసి నిధులను విడుదల చేయడమే కాకుండా పంచాయతీల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. రాయచోటి నియోజకవర్గం రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధికి నాంది పలుకుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు భద్రప్పనాయుడు, మహమ్మద్ రఫీ, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రాంమోహన్‌నాయుడు, రమణారెడ్డి, కదిరిరెడ్డినాయుడు, మహేశ్వర్‌రెడ్డి, రామాంజులురెడ్డి, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సుండుపల్లె, జూలై 13: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని జనసేన నియోజకవర్గ నేత యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. శనివారం తిమ్మసముద్రం గ్రామంలోని ఆంజనేయస్వామి, శివాలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో ఆయన ఇష్టాగోష్టి నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతల రామకృష్ణ, చాంద్ బాషా, ఖాజా, ఒంటేరు రాజా, మున్నా, రామాశ్రీనివాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

చిట్వేలి, జూలై 13 : మండల పరిధిలోని స్తంభారాయుడు ఆలయ సమీపాన నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కాకర్ల సుబ్బరాయుడు తనయుడు కాకర్ల నాగార్జున ఆలయ నిర్మాణానికి 60,116, కె.కందుల వారి పల్లెకు చెందిన యదోటి దొరస్వామినాయుడు, లక్షుమ్మ కుటుంబ సభ్యులు 10,116 శనివారం విరాళం అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సంద ర్భంగా దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకారం అందించాల్సిందిగా ఆయన కోరారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం

ఓబులవారిపల్లె, జూలై 13 : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి తమ ఫౌండేషన్ ద్వారా ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని మంగంపేట ఆర్ఆర్ సెంటర్-1కు చెందిన కళ్యాణదుర్గం వెంకటేశ్ కొంతకాలంగా లివర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ వారికి రూ. 20 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో తల్లెం రమణారెడ్డి, రావులూరు చరణ్, సి.రాజగోపాల్, మారాల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏహెచ్‌ఏలకు నైపుణ్య పరీక్షలు

సిద్దవటం, జూలై 13: మండలంలోని ఏహెచ్‌ఏలకు నైపుణ్య పరీక్షలు నిర్వహించామని, బాకరాపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్లూరు, సిద్దవటం మండలాల్లో పశు వైద్యశాలల్లో నిధులు నిర్వహిస్తున్న వారిలో నైపుణ్యం పెంపొందించడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పల్లె ప్రాంతాల్లో ఉన్న పాడి పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించి, సరైన సమయంలో వ్యాధి నిర్ధారించి, మందులు అందించాలన్నారు. అంకితభావంతో పనిచేయాలని అన్నారు.



సిబ్బందికి పరీక్ష నిర్వహిస్తున్న పశువైద్యాధికారి శివశంకర్

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, జూలై 13 : పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ నీలకంఠరావు తెలిపారు. ఇటీవల రాయచోటిలో జరిగిన సీనియర్ బాలురు, బాలికలు సాఫ్ట్‌బాల్ సెలెక్షన్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.రోహిత్, మొదటి సంవత్సరం విద్యార్థి మధు, 9వ తరగతి విద్యార్థిని జాస్మిన్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆగస్టు 10న చిత్తూరు జిల్లా పుత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆయా విద్యార్థులను పీడీ నీలకంఠరావును ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, అధ్యాపక బృందం అభినందించారు.



రోహిత్, మధు, జాస్మిన్

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

రామాపురం, జూలై 13: రామాపురం తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండలంలోని గోపగుడిపల్లె గ్రా మ సర్వేనెంబర్ 1472లోని 42.18 ఎక రాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదులు రావడంతో శనివారం ఆ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి వీఆర్‌వో నరసింహులు తెలిపారు. ఈ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా వాగులు, వంకలు, కుంటలు, శ్మశానాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్‌వో

బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని వినతి

సంబేపల్లె, జూలై13: రాయచోటి- వడ్లపల్లె, నాయునివారిపల్లెలకు సాయంత్రం 6.30 గంటల బస్ సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ మార్గంలో ఆటోలు కూడా తిరగకుండా ప్రయాణికులు అడ్డుకుంటున్నట్లు తెలిపారు. కరోనా తరువాత కొన్ని రోజులు బస్సు నడిపినా కలెక్షన్ రాలేదని రద్దు చేయడం బాధాకరమన్నారు. సాయంత్రం 3.40 గంటల నుంచి రాత్రి 8.30 గంటల మధ్య రోజువారీ కూలీలు, విద్యార్థులు, ప్రయాణికులు ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. రాయచోటి డిపో పరిధిలో కలెక్షన్ రాని ఎన్నో పల్లెలకు నేటికీ సర్వీసులు నడుపుతున్నారన్నారు. రాయచోటి డిపో పరిధిలోని వడలపల్లె- నాయునివారిపల్లె బస్ సర్వీసు ఒకప్పుడు టాప్ మోస్ట్ కలెక్షన్ వచ్చే సర్వీస్ అని గుర్తు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే బస్ సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సుండుపల్లె, జూలై13: మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ సత్రం సమీపంలోని కస్తూరమ్మ ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓబులయ్య తెలిపారు. వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కంటి వైద్యులతో పాటు సిబ్బంది వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రజలకు దాతల సహకారంతో భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన కోలాటం ప్రదర్శన

పెనగలూరు, జూలై 13: మండలంలోని కంబాలకుంట బీసీ కాలనీలో శనివారం గంగమ్మ జాతర సందర్భంగా నెల్లూరుకు చెందిన గోపాల్ బృందం కోలాటం ప్రదర్శన ఆకట్టు కుంది. ఈ కార్యక్రమం ఆర్ అండ్ బీ ప్రధాన రోడ్డు వెంబడి సాగడంతో వాహనదారులుఆసక్తిగా తిలకించారు.



గంగమ్మ జాతరలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

జిల్లా అంతటా వాన

అత్యధికంగా రామకుప్పంలో 44.8 మి.మీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వాన కురిసింది. రొంపిచెర్ల మినహా మిగిలిన 31 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా రామకుప్పంలో 44.8మి.మీ., అత్యల్పంగా సదుంలో 1.0 మి.మీ నమోదైంది. విజయపురం 41.8, నింద్ర 37.4, పుంగనూరు 35.2, కార్వేటినగరం 34.2, పాలసముద్రం 31.4, శ్రీరంగరాజపురం 30.6, వెదురుకుప్పం 30.2, ఐరాల 27.4, పూతలపట్టు 22.4, చిత్తూరు రూరల్ 21.6, నగరి 21.2, గుడిపాల 20.4, పులిచెర్ల 19.0, చౌడేపల్లి 17.8, చిత్తూరు అర్బన్ 17.8, బంగారుపాళ్యం 17.4, గంగాధరనెల్లూరు 15.2, యాదమరి 13.4, కుప్పం 12.2, పెనుమూరు 12.0, వి.కోట 10.0, తవణంపల్లె 9.6, పెద్దపంజాణి 8.4, పలమనేరు 8.0, గంగవరం 7.2, సోమల 6.6, బైరెడ్డిపల్లి 6.2, శాంతిపురం 2.8, గుడుపల్లిలో 2.6 మి.మీ కురిసింది.

టీడీపీ నేత కుమారుడిపై వైసీపీ దాడి

రామకుప్పం, జూలై 13: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ ననియాలకు చెందిన టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్ కుమారుడు చరణ్‌సాయిపై స్థానిక వైసీపీ సర్పంచు భర్త వైసీపీ నేత గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్ శనివారం సాయంత్రం మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. మనోహర్ రామకుప్పం పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు...మనోహర్, అతని సోదరుడు గజేంద్ర శనివారం మధ్యాహ్నం సొంత పనుల కోసం తమిళనాడు రాష్ట్రం వానియంబాడి పట్టణానికి వెళ్లారు. సాయంత్రం ఐదు గంటలకు గ్రామానికి చెందిన రాజశేఖర్, వేణు, రమేష్‌లు వారికి ఫోన్ చేసి చరణ్‌సాయిపై గోవిందప్ప, సతీష్, మురుగేష్ దాడి చేస్తున్నారని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న చరణ్‌సాయిని గ్రామస్తులు కుప్పం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ననియాలకు చేరుకున్న మనోహర్, గజేంద్ర ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. తాను పొలం వద్ద నడుచుకుని వెళ్తుండగా కత్తులు, గడ్డపార, ఇనుపరాడ్లతో కొట్టి కాళ్లతో తన్ని, చిత్రహింసలు పెట్టారని చరణ్‌సాయి తెలిపాడు. రాజశేఖర్, రమేష్, వేణులు వచ్చి కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపాడు. గోవిందప్ప గతంలోనూ తమ కుటుంబంపై కక్షతో దాడులకు పాల్పడ్డాడని, చర్యలు తీసుకోవాలని మనోహర్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ





ఐరాల(కాణిపాకం),జూలై13: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది.వరసిద్ధుడి దర్శనార్థం వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఉదయానికే క్యూలన్నీ పూర్తిగా నిండి పోయాయి. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

కూలిన పురాతన రావివృక్షం



కార్వేటినగరం, జూలై 13: కార్వేటినగరం స్కంద పుష్కరిణి వద్ద పురాతన రావి చెట్టు శుక్రవారం రాత్రి కూలిపోయింది. దీని వయస్సు 350 సంవత్సరాలు ఉంటుందని, కార్వేటినగరం సంస్థానాధీశుల కాలం నుంచి ఉందని స్థానికులు తెలిపారు. రావిచెట్టులో కొంతభాగం ఇటీవల కూలిపోయింది. తాజాగా చెట్టు మొదలు భాగం చెదలు పట్టేయడంతో రెండుగా చీలి పక్కనే ఉన్న ఉమాతంగమేశ్వర ఆలయ పైకప్పుపై పడింది.

పంచాయతీలకు నిధులు విడుదలపై సీఎంకు కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదం అందిస్తున్న చుక్కా ధనుంజయ యాదవ్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి రూ.250 కోట్లు విడుదల చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన సీఎం చంద్రబాబుకు సర్పంచ్ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్ ఇతర ప్రతినిధులతో కలిసి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధనుంజయ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేర నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. బకాయి ఉన్న మిగతా నిధులు త్వరగా విడుదల చేయాలని ఆయన సీఎంను కోరారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి డేగల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

డీసీసీబీ నిధుల దుర్వినియోగ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 13: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన అవినీతి అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవినీతి, సింగిల్ విండోల్లో జరిగిన దోపిడీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మేనేజర్ యుగంధర్‌లతో కలసి శనివారం ఈ మేరకు జేసీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. డీసీసీబీలో పెద్దఎత్తున అవినీతి అక్రమాలు జరిగినట్లు వార్తలొచ్చాయన్నారు. ముఖ్యంగా రుణపంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలకు, అనర్హులకు రుణాలు మంజూరు చేసి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. జేఎల్‌జీ రుణాలు కూడా పక్కదారి పట్టినట్లు వార్తలు వచ్చాయన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ప్రోత్సాహంతోనే బ్యాంకులో ఇన్ని అక్రమాలు జరిగాయని, ఇందులో కొందరు బ్యాంకు ఉద్యోగులు కూడా పాత్రధారులై ఉన్నారని అన్నారు. ఉన్నతాధికారులతో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాల రద్దు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. 16వ తేదీన ఆలయంలో ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈక్రమంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో వీఐపీ బ్రేక్ దర్శనాలకు 15వ తేదీన ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

స్విమ్స్‌లో డీఈవో పోస్టుకు 20న ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), జూలై 13: స్విమ్స్ వైరాలజీ విభాగంలో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో) పోస్టుకు ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు 35 ఏళ్ల లోపువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో 20తేదీ ఉదయం 8 గంటలకు స్విమ్స్ కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

తిరుపతి ఎస్పీగా సుబ్బరాయుడు

హర్షవర్ధన రాజు కడపకు బదిలీ



సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జులై 13 : తిరుపతి జిల్లాకు ఎస్పీగా ఎల్. సుబ్బరాయుడు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా బండమీదపల్లెకు చెందిన సుబ్బరాయుడు 2007లో డీఎస్పీగా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం, ఏలూరుల్లో డీఎస్పీగా పనిచేసిన తర్వాత నిజామాబాద్, అనంతపురం ,కరీంనగర్ జిల్లాల్లో అదనపు ఎస్పీగా పనిచేశారు. 2013లో ఐపీఎస్ హోదా లభించింది. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి గవర్నర్ వద్ద సీఎస్‌ఓగా పనిచేశారు.2014 నుంచి 2019 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసి మంచి అనుభవం గడించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక తెలంగాణా క్యాడర్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ సీఐడీలో ఎస్పీగా పనిచేశారు.2023లో కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఆయన్ను ఎన్నికల సమయంలో డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆయన్ను హైదరాబాదు ట్రాఫిక్ డీసీపీగా నియమించారు. అక్కడ పనిచేస్తూ ఏపీకి డిప్యుటేషన్‌పై రావడానికి దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల క్రితం ఏపీకి ఇంటర్ క్యాడర్ బదిలీపై వచ్చిన సుబ్బరాయుడు తాజాగా తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమితులయ్యారు. అలాగే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బరాయుడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఎస్పీ హర్షవర్ధన రాజును కడపకు బదిలీ చేశారు.ఆయన ఇక్కడ పని చేసిన రెండు నెలల వ్యవధిలోనే పోలీసు శాఖను గాడిలో పెట్టడానికి కృషి చేశారు. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యసేవనాన్ని అరికట్టేందుకు ప్రయత్నించారు.

తిరుమల క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసిన ఇద్దరిపై కేసు నమోదు



వీడియోలో మాట్లాడుతున్న వాసన్

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఇద్దరిపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవారి దర్శనం కోసం నారాయణగిరి షెడ్‌లోని కంపార్టుమెంట్‌లో భక్తులు వేచివున్న సందర్భంలో ఓ యువకుడు తాళాలు తీస్తున్నట్టు నటించగా భక్తులందరూ తాళాలు తీస్తున్నారనే భ్రమలో పైకిలేచి గోవిందనామస్మరణలు చేశారు. ఈ లోగా ఆ యువకుడు వెకిలినవ్వులతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దృశ్యాలను 'టీటీఎఫ్ ఫ్యామిలీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో పోస్ట్ చేయగా, ఈ ప్రాంక్ వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయంలో 11వ తేదీన మీడియాలో రావడంతో టీటీడీ స్పందిస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో టీటీడీ సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు టీటీఎఫ్ పేజ్‌ను నడుపుతున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన వి.వైకుంఠవాసన్, అతని స్నేహితుడు గోవిందరాజ రామస్వామి అనే యువకులపై తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా, ప్రాంక్ వీడియో చేసిన వ్యక్తుల కోసం ఓ బృందం తమిళనాడుకు వెళ్లింది. తొలత వైకుంఠవాసన్, గోవిందరాజ స్వామిని అదుపులోకి తీసుకుని ఆ తర్వాత ప్రాంక్ వీడియో చేసిన మిగిలినవారిని కూడా అదుపులోకి తీసుకునేందుకు భద్రతాధికారులు ప్రయత్నిస్తున్నారు.

వీడియో తీసినందుకు క్షమించండి: వాసన్

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వీడియో ఉంటే తనను క్షమించాలంటూ ప్రాంక్ వీడియో పోస్ట్ చేసిన పేజ్ క్రియేటర్ వాసన్ శనివారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. తాను తన స్నేహితులతో కలిసి భక్తిభావంతోనే తిరుమలకు వచ్చామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయంలోకి ఫోన్ తీసుకెళ్లానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందు తమ సెల్‌ఫోన్లను డిపాజిట్ చేశామన్నారు. అయితే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించే ముందున్న నారాయణగిరి షెడ్లలో తమ స్నేహితులతో సరదాగా ఓ వీడియో చేశామని, ఈ వీడియో తప్పుగా ప్రజల్లోకి వెళ్లిపోయిందన్నారు. నిజానికి అది ప్రాంక్ కాదని, తాము కంపార్టుమెంట్లలో వేచి ఉన్నప్పుడు కొందరు ఉద్యోగులు తాళాలు తీస్తున్నట్టు దగ్గరకు వచ్చి వెళ్లిపోయారని, దాన్నే తాము సరదాగా రీక్రియేట్ చేశామని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. కానీ వీడియో చాలా తప్పుగా వైరల్ అయ్యిందని, ఈ వీడియో వల్ల ఎవరి మనసైనా కష్టపడి ఉంటే క్షమించాలని కోరాడు. కులాలు, మతాలపై తమకు ఆసక్తి లేదని, అందులో భాగంగానే ఇతర మతానికి చెందిన తనస్నేహితుడు అజీస్ కూడా స్వామి దర్శనానికి వచ్చాడని తెలిపాడు.

టీటీడీ సీవీఎస్వో బదిలీ



తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారి(సీవీఎస్వో) డి.నరసింహకిషోర్ బదిలీ అయ్యారు. 2022 ఏప్రిల్ 6వ తేదీన బాధ్యతలు స్వీకరించిన నరసింహకిషోర్ రెండేళ్ల మూడునెలల పాటు టీటీడీలో పనిచేశారు.తూర్పు గోదావరి జిల్లాకు ఆయన్ను బదిలీ చేశారు. అయితే ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. తిరుమలలో భద్రతావైఫల్యంపై ఈ రెండేళ్లలో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా టీటీడీ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఓ డ్రోన్ కెమెరా నేరుగా ఆలయం పైకే వెళ్లడం కలకలం సృష్టించింది. గత ఏడాది జనవరిలో అఖిలాండం నుంచి శ్రీవారి ఆనందనిలయం వరకు తీసిన డ్రోన్ విజువల్స్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. సర్వే కోసమని ఓ సంస్థకు అనుమతి ఇచ్చి పర్యవేక్షణను గాలికొదిలేయడంతో ఆ సంస్థ ఉద్యోగి డ్రోన్ ద్వారా వీడియో తీసి నెట్‌లో అప్‌లోడ్ చేశాడు. అలాగే గత ఏడాది మే నెలలో ఓ యువకుడు భద్రతాతనిఖీలు దాటుకుని ఆలయంలోకి వెళ్లి ఆనందనిలయం వీడియోను తీసి సోషల్‌మీడియాలో పెట్టాడు. ఈ ఏడాది కూడా ఓ జంట డ్రోన్ కెమెరాలతో తిరుమలకు రావడమే కాకుండా ఘాట్‌రోడ్డులో వీడియోను తీయడం కూడా విమర్శలకు దారితీసింది. మరోవైపు గతంలో ఎన్నడూ లేనివిధంగా తిరుమలలో గంజాయి పట్టుబడటం కూడా అందరినీ ఆశ్చర్యపరిచింది.తిరుమలలో నిషేధించిన మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు కూడా తరచూ దర్శనమిచ్చాయి. ఈ పరిస్థితుల్లో తిరుమలలో భద్రతను మరింత పటిష్ఠం చేయడంలో భాగంగా ఎవరిని సీవీఎస్వోగా నియమిస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఆరుగురికి గాయాలు





మృతి చెందిన ఉపేంద్రాచారి, వైన్ షాపు పరిసరాలలో మృతి చెందిన వ్యక్తి

ఐరాల(కాణిపాకం), జూలై 13: కాణిపాకం పోలీసు స్టేషన్ పరిధిలోని చిగరపల్లె హైవే వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసి మృతి చెందగా, ఆరుగురు గాయపడినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన ఉపేంద్రాచారి తన స్నేహితులు ఏడుగురితో కలసి సొంత వాహనంలో శుక్రవారం బయల్దేరి శనివారం తిరుపతి వచ్చారు. శ్రీవారి దర్శనానికి సమయం ఉండటంతో వీరు కాణిపాకం వరసిద్ధుడి దర్శనానికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొనగా, వెనక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపేంద్రాచారి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం సీఎంసీకి తరలించారు. స్వల్పంగా గాయపడిన సురేష్‌గౌడ్, మధుబాబు, ఒప్పలయ్య, మహేందర్, గంగాధర్‌లు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాహనాన్ని నడుపుతున్న మధుబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాణిపాకంలోని ఓ వైన్ షాపు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గళ్ల చొక్కా ధరించినట్లు పేర్కొన్నారు.

రాజనాలబండ పంచాయితీలో ఇరువర్గాల ఘర్షణ

● ఒకరికి విరిగిన కాలు ● మరో ఇద్దరికి తీవ్రగాయాలు







దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు, కాలు విరిగిన ప్రభాకర్‌రెడ్డి, గాయాలైన గణేష్

చౌడేపల్లె, జూలై13: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో పంచాయితీ నిర్వహిస్తుండగానే ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ దాడుల్లో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని కొలింపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు నాగరాజ ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన సావిత్రిమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఆమె తీవ్ర గాయాలపాలై నడుం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై బాధితురాలికి నష్టపరిహారం చెల్లించి కేసు రాజీ చేసుకోవాలని నిర్ణయించారు. పంచాయతీ చేసి సమస్య పరిష్కరించడానికి రాజనాలబండ స్థలాన్ని ఎంపిక చేశారు. బాధితుల వైపు నుంచి వైసీపీ నాయకుడు కొలింపల్లెకు చెందిన ప్రభాకర్ మరికొందరు పెద్ద మనుషులు వచ్చారు. అలాగే టీడీపీకి చెందిన నాగరాజ అతని బంధువు గణేష్, మరికొందరు పెద్ద మనుషులు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు, గ్రామపెద్దలు ఇరువర్గాల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేపట్టారు. ఈక్రమంలో పంచాయతీ పెద్దలు తమకు న్యాయం చేయలేదని ఇరువర్గాల నడుమ మాటామాటా పెరిగింది. అది దాడులకు దారితీసింది. ఈదాడిలో ప్రభాకర్‌కు కాలు విరగగా, గణేష్, నాగరాజకు బలమైన గాయాలయ్యాయి. గాయాలైన వారిని మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాటు కాటుతో ఇద్దరికి అస్వస్థత

పుంగనూరు రూరల్, జూలై13: పొలాల్లో పనిచేస్తున్న ఇద్దరిని పాము కాటేసింది. దీంతో వారు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన శనివారం రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం దాసార్లపల్లెకు చెందిన నారాయణ(50) పొలంలో పనులు చేస్తుండగా పాటు కాటు వేసింది. అదేవిధంగా కేసీపల్లెలో కాపురం ఉన్న జయచంద్ర పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ఇద్దరినీ చుట్టుపక్కల రైతులు గుర్తించి వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూలై13: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన రామసముద్రం మండలంలో శనివారం జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం ఎం. గొల్లపల్లెకు చెందిన మునివెంకటస్వామి కుమారుడు శ్రీనివాసులు(35) కుటుంబకలహాలతో పంటలకు తెచ్చిన పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. కుటుంబసభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కడప మహిళ దారుణహత్య

గొంతుకోసిన గుర్తుతెలియని వ్యక్తి



రెడ్డెమ్మ మృతదేహం

తిరుపతి రూరల్, జూలై 13: కడప జిల్లాకు చెందిన మహిళ ఒకరు తిరుపతిలో దారుణహత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి బాలిరెడ్డి తన భార్య ప్రసన్న అలియాస్ రెడ్డెమ్మ(58), కుమార్తె గుర్రమ్మ(34)తో కలసి బతుకుదెరువు నిమిత్తం సుమారు 30 ఏళ్ల కిందట తిరుపతికి వచ్చారు. గుర్రమ్మకు కంటిచూపు సరిగా కనిపించక పోవడంతోపాటు మానసిక పరిస్థితి సరిగా లేదు. దాదాపు పదేళ్ల కిందట తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో తిరుపతికి చెందిన బి.మాలతికి చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. అందులో శ్రీబాలాజి పార్కింగ్ యార్డ్ పేరిట ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేసి వారి వద్దనుంచి ఫీజు వసూలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాలిరెడ్డి తన వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి ఈనెల ఒకటో తేదీన కుమార్తెతో కలసి స్వగ్రామానికి వెళ్లాడు. కుమార్తె ఈనెల 8న తిరుపతికి రాగా, సొంతపనుల నిమిత్తం బాలిరెడ్డి స్వగ్రామంలోనే ఉండిపోయాడు. శనివారం ఉదయం దాదాపు 5.30గంటల ప్రాంతంలో కుమార్తె స్నానం చేయడానికి వేడినీరు పెట్టడానికి తల్లి రెడ్డెమ్మ సిద్ధమవుతోంది. ఈసమయంలో బ్లూషర్ట్ ధరించి ఉన్న వ్యక్తి గోడదూకి ఇంట్లోకి వచ్చి కుమార్తె గొంతు పట్టుకోవడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తల్లి రావడంతో ఆ వ్యక్తి తన చేతిలో కత్తితో ఆమె గొంతు కోసి గోడదూకి పరారయ్యాడు. కొంతసేపటికి గుర్రమ్మ ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం వద్దకొచ్చి తన తల్లి చనిపోయిందని చెప్పింది. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదన్న కారణంతో దుకాణ నిర్వాహకురాలు రాధమ్మ పెద్దగా పట్టించుకోలేదు. అయితే గుర్రమ్మ ఏడుస్తూ ఎంతకూ అక్కడినుంచి వెళ్లక పోవడంతో అటుగా వెళుతున్న పారిశుధ్య కార్మికుడికి విషయం చెప్పింది. తర్వాత ముగ్గురూ కలిసి రెడ్డెమ్మ ఇంటికెళ్లారు. గేటు తాళం వేసి ఉండటంతో ఎలా బయటకు వచ్చావని గుర్రమ్మను ప్రశ్నిస్తే.. గేటు ఎక్కి దూకానని చెప్పింది. తాళం ఎక్కడుందని అడిగితే గేటు ఎక్కి లోపలికెళ్లి తీసుకొచ్చింది. గేటు తాళం తీసి ఇంటి లోపలకు చూడగా.. రెడ్డెమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. భయపడ్డవారు వెనక్కి వచ్చేశారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డులకాలనీ వరకు వచ్చి ఆగిపోయాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి వస్తువులు బయటపడినట్లు సమాచారం.

అమ్మా చనిపోయింది.. చైనూ ఎత్తుకెళ్లారు

అమ్మా చనిపోయింది.. తన మెడలోని చైనూ ఎత్తుకెళ్లారు అంటూ శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గేటు బయట రోడ్డుపై కూర్చొని విలపిస్తున్న గుర్రమ్మను చూసిన వారంతా కంటతడి పెట్టారు.

భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించండి

టీటీడీ అధికారులతో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న సీఎస్

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నిరీక్షణ సమయాన్ని తగ్గించేదిశగా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులకు ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న ఆయన తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావుతో కలిసి భక్తుల సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మారిన తర్వాత గత నెలరోజుల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు తీసుకున్న నిర్ణయాలు, అమలుచేస్తున్న విధానాలపై సీఎస్‌కు ఈవో వివరించారు.భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు టైం స్లాట్‌సర్వదర్శన టోకెన్ల జారీలో తీసుకోబోతున్న నిర్ణయాలను, ఐటీ విభాగం ద్వారా చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలను ఈవో వివరించారు. తిరుమలలో పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యం, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల్లో నాణ్యత పెంపు కోసం చేస్తున్న మార్పులను సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నిర్ణయాలను అభినందించిన సీఎస్ తిరుమలలో భక్తులకు మంచి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. రోజుకు ఎంతమంది దర్శనానికి వస్తున్నారు, ఎలాంటి దర్శన పద్ధతులున్నాయి వంటి విషయాలపై ఆరా తీశారు. అలాగే సౌకర్యాల కల్పనపై కొన్ని సూచనలు చేశారు.

దిగువపల్లి వద్ద అక్రమ ఇసుక నిల్వలు సీజ్



దిగువపల్లి వద్ద ఇసుక దిన్నెను సీజ్

పెద్దమండ్యం, జూలై 13: పెద్దమండ్యం మండలం దిగువపల్లి సమీపంలోని పెద్ద నల్లగుట్ట వద్ద అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక దిన్నెలను అధికారులు సీజ్ చేశారు. పెద్దమండ్యం తహసీల్దార్ లక్ష్మీనాయక్, డీటీ రవినాయక్, ఎస్ఐ చలపతి, ఆర్ఐ రమేష్, వీఆర్వో షక్రూలు శుక్రవారం రాత్రి ఇసుకను సీజ్ చేశారు. కాగా 125 టన్నుల ఇసుక దిన్నె గుర్తించి రెవెన్యూధికారులు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ ప్రాంత ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన అధికారులు హుటాహుటిన వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపట్టారు.

పిచ్చలవాండ్లపల్లె వద్ద ఇసుక నిల్వలు స్వాధీనం



పిచ్చలవాండ్లపల్లె వద్ద ఇసుక నిల్వలు స్వాధీనం చేసుకున్న అధికారులు

కురబలకోట, జులై 13: మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ సమీపంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రెవెన్యూ, పోలీసులు అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణం కోసం భారీ స్థాయిలో ఇసుకను నిల్వ ఉంచారు. దీంతో అక్కడ ఉన్న నిల్వలను, అక్కడ భారీస్థాయిలో ఇసుక గుట్టల నిల్వలను గుర్తించారు. ఆ ఇసుకకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో నివేదికలను కలెక్టర్‌కు పంపించనున్నట్లు డీటీ నవీన్‌తాజ్ పేర్కొన్నారు. కాగా వాటికి సంబంధించి గనుల, భూగర్భ శాఖాధికారులు రెండు రోజుల్లో ఇక్కడికి వచ్చి నిల్వలు సంబంధించి అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



ములకలచెరువు, జూలై 13: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పీటీఎం రోడ్డులోని నాయనిచెరువుపల్లె సత్రం వద్ద రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో జింక తీవ్రంగా గాయపడడంతో గమనించిన ద్విచక్రవాహనదారుడు మధు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. ఈ క్రమంలో సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది చికిత్సల నిమిత్తం స్థానిక పశువైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందింది. అనంతరం శనివారం జింక కళేబరాన్ని కనుగొండ అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

గాలీవర్షానికి విరిగిన కరెంట్ స్తంభాలు



విరిగి విద్యుత్ స్తంభంపై పడిన వేపచెట్టు

రామసముద్రం, జూలై 13: ఈదుర గాలులతో కూడిన వర్షానికి నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయ తీ తిరుమల రెడ్డిపల్లెలో శుక్రవారం రాత్రి బీసీ కాలనీ వీధి పక్కనున్న వేపచెట్టు విరిగి కరెంట్ లైన్‌పై పడడంతో నాలుగు స్తంభాలు విరిగి పడ్డాయి. ఇది గమనించిన గ్రామస్థులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఓ స్తంభం ఇంటి ప్రహరీ మీద పడగా గోడ స్వల్పంగా దెబ్బతింది. స్తంభాలు విరిగి పడ్డప్పుడు వీధిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. అధికారులు విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ములకలచెరువు, జూలై 13: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు...మండలంలోని బురకాయలకోట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మధ్యాహ్నం నడిచే ప్యాసెంజర్ రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కుడి ఛాతిపై కాలిన గాయం, బ్లూ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని, బంధువులు, కుటుంబీకులు గమనిస్తే తమకు సమాచారం అందజేయాలని కదిరి రైల్వే ఎస్ఐ ఇబ్రహీం తెలిపారు.

ఉపాధి పనులకు బోర్డులు ఏర్పాటు చేయాలి



సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహిస్తున్న ఉపాధి హామీ అధికారులు

రామసముద్రం, జూలై 13: ఉపాధి హామీ పనుల కింద కాలువలు, రోడ్లు, చెరువులు సంబంధించిన పని చేసిన వాటికి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ ఎస్ఆర్‌పీ సుబ్బారావ్, డీఆర్‌పీ చెంగయ్య, ఏపీవో గౌరీశంకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి ద్వారా రైతులు వారి వ్యవసాయ భూములలో మామిడి, అల్లినేరేడు, చింతచెట్లు నాటిన రైతులకు ఎన్నికల కోడ్ కారణంగా బిల్లుల చెల్లింపులు ఆలస్యమైందన్నారు. సెక్రటరీ భానుప్రసాద్, సర్పంచ్ రెడ్డెప్పనాయుడు, ఎంపీటీసీ రెడ్డెప్ప, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైభవంగా మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, జూలై 13: ధర్మపథం సమూహాలయంలో శనివారం ఆలయ ప్రాంగణంలోని శనేశ్వర స్వామికి మహాతైలాభిషేకం వేడుకగా వైభవంగా జరిగింది. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసా దాల పంపిణీ, అన్న వితరణ చేపట్టారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గాడితప్పిన సచివాలయ పాలన

●దీర్ఘకాలిక సెలవుల్లో పలువురు ఉద్యోగులు ● బదిలీపై మరికొందరు ● ఇలా అయితే పాలన ఎలాసాగుతుందంటున్న జనం



పెద్దమండ్యం, జూలై 13: కొందరు ఉద్యోగుల నిర్వాహకంతో గ్రామ సచివాలయ పాలన గాడితప్పుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు వస్తే ఉత్సాహంగా ఉద్యోగాలు చేయాల్సి ఉండగా పలువురు విధులకు హాజరు కాకుండా ఎప్పుడూ సెలవుల్లోనే కాలం గడుపుతుండడంతో ప్రజా సమస్యల పరి ష్కారానికి అడ్డంకులు తప్పడంలేదు. ముందుగా నెల సెలవు పెట్టిన వారు ఆతరవాత రెండు, మూడు నెలలు సెలవులు మంజూరు చేయాలని పొడిగించుకుంటు లీవ్ లెటర్లు పోస్టుల ద్వారా అధికారులకు సమాచారం పంపిస్తున్నారు. కారణం అధికారుల వద్దకు వస్తే సెలవుల మంజూరుకు నిరాకరిస్తారని భావించి అలా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మరి కొందరు ఒక సారి లీవ్ లెటర్ ఇచ్చి వెళ్లిన తరవాత ఇక అంతే సంగతులు. అలా ఒక సంవత్సరం, మరి కొందరు రెండు సంవత్సరాలగా విధులకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. పెద్దమండ్యం మండలంలోని వెలిగల్లు గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరు అసిస్టెంట్ ఇద్దరు ఒకటన్నర సంవత్సరాలు సెలవులో కొనసాగుతున్నారు.. బండ్రేవు గ్రామ సచివాలయంలో ఇంజనీరు అసిస్టెంట్ రెండేళ్లగా విధులకు హాజరుకాలేదు. డిజిటల్ అసిస్టెంట్ సంవత్సరం క్రితం బదిలీపై వెళ్లారు. ముసలికుంట గ్రామ సచివాలయంలో మూడేళ్ల క్రితం మహిళా పోలీసు రాజీనామా చేసి వెళ్లగా, ఆగ్రికల్చర్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లారు. కలిచెర్ల గ్రామ సచివాలయ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ లు బదిలీపై వెళ్లారు. మండల స్థాయి శాఖలోని హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో గ్రామ సచివాలయ ఇంజనీరు అసిస్టెంట్‌లను ఇన్‌చార్జ్‌ల పాలనగా కొనసాగుతోంది. కొందరు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కరువైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటరమణయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మండలంలో పలు గ్రామ సచివాల యాల్లో కొందరు బదిలీలపై వెళ్లగా, మరి కొందరు సెలవులపై వెళ్లార న్నారు. మరికొందరు చెప్పకుండా విధులకు గైర్హాజరవుతున్నారని ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సెలవుపై వెళ్లిన వారు అనారోగ్య కారణాల వల్లే సెలవుపెట్టినట్లు ఎంపీడీవో వెల్లడించారు.

విలువలు కలిగిన నాయకుడు అమరనాథ రెడ్డి



కలికిరిలో తండ్రి అమరనాథ రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

వాల్మీకిపురం మార్కెట్ యార్డు వద్ద అమరనాథరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



కలికిరి, జూలై 13: రాజకీయాల్లో విలువలు పాటిస్తూ దివంగత మాజీ మంత్రి నల్లారి అమరనాథ రెడ్డి రాష్ట్ర స్థాయికి ఎదిగిన నాయకుడుగా రాణించి అభివృద్ధి కార్యక్రమాలతో 40 ఏళ్ల క్రితమే నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చారని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి కొనియాడారు. శనివారం అమరనాథ రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అమరనాథ రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, రహంతుల్లా, మాలతి, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, రహంతుల్లా, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, సహదేవ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, రమేష్ చెట్టి, జనసేన అస్లామ్, సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మునాఫ్, కుమార్, వర్మ, విజయకుమార్ రెడ్డి, చిన్నరెడ్డెయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: మాజీ మంత్రి, దివంగత నల్లారి అమరనాథరెడ్డి 37వ వర్ధంతిని శనివారం పీలేరు పట్టణంలోని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోటపల్లె క్రాసులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద అమరనాథరెడ్డి చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వ వాయల్పాడు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఆయన చేపట్టిన అభివృద్ధి పథకాలు, నియోజకవర్గంలో ఆయన సాధించిన విజయాలను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లారి రియాజ్, పోలిశెట్టి సురేంద్ర, స్పోర్ట్స్ మల్లి, కోడిరామకృష్ణారెడ్డి, హనీఫ్, మల్లి, సుభాష్, ఫైరోజ్, బర్కతుల్లా, వెంకటరమణ నాయక్, గుర్రం నరేశ్, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శనివారం దివంగత మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి 37వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మర్రిపాడు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట నల్లారి అమరనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మండలంలోని చింతపర్తి మార్కెట్ వద్ద కూడా నల్లారి అమరనాథరెడ్డి వర్ధంతి వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పేదలకు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటరమణ, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, బాస్కర్ రెడ్డి, మురళి, కువైట్ బాబు, స్వర్ణలత, అడ్వకేట్ రమణ, సయ్యద్‌బాషా, తెలుగు యువత చాను, టీడీపీ బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: దివంగత మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి 37వ వర్ధంతిని శనివారం గుర్రంకొండ మార్కెట్ యార్డు వద్ద టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలన కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, మూర్తిరావు, నౌషాద్ అహ్మద్, ఎల్లుట్ల మురళి, హరిప్రసాద్‌నాయుడు, జయసూరి, మహాత్మారెడ్డి, చలమారెడ్డి, నాగేంద్రరెడ్డి, చలపతి, సుంకరశేఖర్, చంద్రబాబు, ప్రదీప్, బయ్యారెడ్డి, ప్రకాశ్, పులి జ్యోతిరెడ్డి, జయప్రకాశ్, సుబ్బరాజు, నరసింహులు, ద్వారక, రామయ్య, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

హంస మదనపల్లె యూనిట్ కార్యవర్గం ఎంపిక



ఏకగ్రీవంగా ఎన్నుకున్న హంస నూతన కార్యవర్గం

మదనపల్లె టౌన్, జూలై 13: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) మదనపల్లె యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. శనివారం స్థానిక బేబివెలకమ్‌హోంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడుగా పి.పుల్లమరాజు, ప్రధానకార్యదర్శిగా ఎస్.జమీల్‌అహ్మద్, కోశాధికారిగా పి.విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా సి.రెడ్డి హేమలత, మహిళా కార్యదర్శిగా ఎస్.విజయలక్ష్మి, పబ్లిసిటి కార్యదర్శిగా కె.కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.మునీరా, బి.ఉమదేవి, కె.బాలాజినాయక్ ఎన్నికయ్యారు.

నవధాన్యాల అలంకరణలో గాయత్రీదేవి

మదనపల్లె అర్బన్, జూలై13: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా శనివారం గాయత్రీదేవిని నవధాన్యాలతో ప్రత్యేకంగా ఆలయ అర్చకుడు కార్తీక్ దీక్షిత్ అమ్మవారిని అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుర్రంకొండ, జూలై 13: గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలను చేశారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలి

పెద్దతిప్పసముద్రం జూలై 13 : ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకే భక్తి ప్రవచనాలను నిర్వహిస్తున్నట్లు పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన భోగి మోహన్‌రావు, పావని బృందంచే హనుమాన్ చాలీసా, శ్రీరామనామ సంకీర్తనలతో పాటు శివనామ సంకీర్తనలను వచన కావ్యలతో అందరికి అర్థమయ్యే విధంగా బోధించారు. ముందుగా హనుమంతుని గొప్ప తనం గురించి హనుమాన్ చాలీసా రూపంలో ప్రజలకు బోధించారు. రామాయణంలోని శ్రీరామ చరితం గురించి శ్రీరామ సంకీర్తనలు వివరించారు. అనంతరం శివనామ సంకీర్తనలు బోధించారు. అనంతరం సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో భక్తులకు అన్నధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.కొత్తకోటకు చెందిన ఆకుల మల్లికార్జునతో పాటు పీటీఎం శివాలయ సేవకులు, పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు..అంధకారంలో ప్రజలు

తంబళ్లపల్లె, జూలై 13: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని పలు వీధుల్లో కొన్ని రోజులుగా వీధి దీపాలు పాడై వెలగకపోవడంతో ప్రజలు అంధకారంలో ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా తంబళ్లపల్లె రాగిమాను కూడలి నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ప్రధాన రహదారిలో వీధి లైట్లు వెలగక చిమ్మ చీకట్లు అలముకున్నాయి. దీంతో ఆ దారిలో ప్రయాణించే వాహనాదారులు, పాదచారులు చీకట్లో రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా వెంకటేశ్వర వీధి, సాలివీధి, రామాలయం వీధుల్లో పలు చోట్ల వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. చీకటికి తోడు అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో విషసర్పాలు, కుక్కల బెడదతో సాయంత్రం 6 దాటితే బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. అదేవిధంగా తంబళ్లపల్లె మండల కేంద్రంలోని వెంకటేశ్వరవీధి, సాలివీధుల్లో తాగు నీరు సరఫరా అయ్యే జీఐ పైపు పలు చోట్ల దెబ్బతిని నీరు వృథాగా రోడ్డుపై పోతోంది. దీంతో పాటు వర్షపు నీరు తాగునీటి పైపు లైన్లలో కలసి నీరు కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేసి, తాగునీరు లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాభివృద్ధికి సహకరిస్తా..

మదనపల్లె అర్బన్, జూలై13: స్థానిక చిప్పిలి గ్రామంలోని బాలఅయ్యప్ప స్వామి ఆలయంలో నూతన కమిటీని ఏర్పాటు చేసి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఆయన అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేశాయని ఇదే సహకారం అందిస్తానన్నారు. ఆలయకమిటీ సభ్యులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను పూలమాలతో దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కార్తీక్‌దీక్షిత్, యోగభోగేశ్వర ఆలయం ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్. బీజేపీ నాయకుడు జర్మనీరాజు, ఆనంద్‌నాయుడు, హేమంత్, శివారాయల్, బాలకృష్ణయాదవ్, నాగరాజు, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

వాల్మీకిపురం, జూలై 13: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తిలో శనివారం ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గు, జలుబు దుగ్మతలు ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేసి వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు. ప్రస్తుతం సీజన్‌లో వచ్చే డయేరియా, డెంగ్యూ, ఓఆర్ఎస్ ద్రావణం ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, సీహెచ్‌వో ఇందిరారాణి, సూపర్‌వైజర్‌లు సుధాకర్, భానుబీ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 11 మంది విద్యార్థుల ఎంపిక

మదనపల్లె అర్బన్, జూలై13: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని రామిరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 11మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ స్కూల్ హెచ్‌ఎం రాజేంద్రబాబు తెలిపారు. ఇందులో ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ, శ్రీకాకుళంలోని నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను స్థానిక వివేకానంద మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు. ఇందులో బి. దీక్షిత, హేమమాలని, ఖ్యాతి, వి. లక్ష్మీ, జి. మహర్షిక, హరిత, తేజవర్ధన్, గణేశ్వరీ, రాకేష్, రాగిణి, ధనలక్ష్మీ తదతరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, సుధాకర్, కౌన్సిలర్ శివయ్య పాల్గొన్నారు.

కలకడలో: కలకడ మండలానికి చెందిన షమీమ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మలాంషా వలి తెలిపారు. గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచింది. ఈ క్రమంలో ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ట్రిపల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించండి



ఆర్టీసీ బస్టాండు వెనుక రోడ్డుపై కుంటలాగా మారిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, జూలై 13: మదనపల్లె పట్టణంలో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం బెంగళూరు రోడ్డులోని సురభికాలనిలో ఏడాదిగా పరిష్కారం కాని మురుగు నీటి కాలువను రూ.2.5లక్షలతో మరమ్మతుల కోసం ఎమ్మెల్యే పూజ చేసి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనుక ఆటోస్టాండ్ వద్ద నాలుగేళ్ల పరిష్కారం కాని వర్షపునీటి నిల్వ సమస్యను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షం వచ్చినా నడిరోడ్డుపై మోకాలు లోతున నీరు నిలుస్తూ ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, వెంటనే మున్సిపల్ అధికారులు దీనిపై పరిశీలించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజిలోకి మళ్లించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో జేసీబీ మధు, అంకి శెట్టిపల్లె టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ, శశి పాల్గొన్నారు. అంతకు ముందు నియోజక వర్గంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలసి వినతి పత్రం అందించారు. టెక్నికల్ అర్హత వున్న డిజిటల్ అసిస్టెంట్లను వివిధ ప్రభుత్వశాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరారు. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల డిజిటల్ అసిస్టెంట్లు విన్నవించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించిన పంచాయతీ అధికారులు

పెద్దతిప్పసముద్రం జూలై 13 : మండల కేం ద్రమైన పీటీఎంలో పంచాయతీ అధికారులు పారిశుద్యంపై దృష్టి సారించారు. రాష్ట్రంలోని పలు మండలాల్లో డయేరియా వ్యాప్తి చెందు తుండడంతో ప్రభుత్వం పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా పంచాయతీ అధికా రులను ఆదేశించింది. దీంతో మండల కేంద్రం లోని పలు వీధుల్లో ప్రధాన మురుగు కాలువల ను పంచాయతీ కార్మికులచే శుభ్రం చేయిస్తు న్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా మాట్లాడుతూ గ్రా మాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పెద్దమండ్యంలో: మండలంలోని పెద్దమండ్యం, పాపేపల్లి గ్రామ పంచాయతీలలో పారిశుద్య పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పెద్దమండ్యం కుషావతినది వద్ద మురుగు నీటి కాలువ వద్ద పేరుకుపోయిన చెత్తను యంత్రాలతో తొలగించారు. పారిశుద్య పనుల మరింత వేగవంతం చేస్తామని ఎంపీడీవో వెంకటరమణయ్య, గ్రామ కార్యదర్శులు జనార్ధన, జగన్ తెలిపారు.

జీపీఎస్ జీవోను వెనక్కు తీసుకోవాలి



జీవో ప్రతులను దహనం చేస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

పీలేరు, జూలై 13: జీపీఎస్ విధానాన్ని అమల్లోకి తెస్తూ ఇచ్చిన జీవోను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఏపీసీపీఎస్‌ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో శనివారం పీలేరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జీపీఎస్‌ను అమలు చేస్తూ గత ప్రభుత్వం జూన్ 12వ తేదీన తెచ్చిన జీవోను ఒక నెల తరువాత ఈ ప్రభుత్వం గెజిట్ రూపంలో ఇవ్వడం శోచనీయమన్నారు. కాగా సీఎం చంద్రబాబు నాయుడు గతంలో హామీ ఇచ్చిన విధంగా జీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ జీపీఎస్ గెజిట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్ర మంలో సంఘ నాయకులు సురేశ్ కుమార్, జయప్రకాశ్, ఇంద్రసేనారెడ్డి, ఈశ్వరయ్య, రిజ్వాన్, అల్తాఫ్, గంగంగరాజు, నజీర్, విజయ్, శివ, శంకరయ్య, జయరాం పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ రమణ పేర్కొన్నారు. 2023 అక్టోబరు నుంచి సీపీఎస్ ఉద్యోగులందరికీ జీపీఎస్‌లోకి తెస్తూ గెజిట్‌ను ఇప్పుడు విడుదల చేయడం అధికారులు, ఉద్యోగులను మోసం చేయడమే అన్నారు. తక్షణమే ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్రప్రభుత్వం ఇచ్చిన మెమో57ను వెంటనే అమలు చేసి 2003 డీఎస్సీ ద్వారా అపాయింట్‌మెంట్ పొందిన ఉపాధ్యాయులందరిని తిరిగి పాత పెన్షన్ లోకి తీసుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్య తీసుకోండి



విద్యార్థులను బయటకు పంపుతున్న ఏబీవీపీ నాయకులు

మదనపల్లె టౌన్/అర్బన్, జూలై 13: విద్యాహక్కు చట్టాన్ని పాటించకుండా ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహి స్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పాఠశాలల రాష్ట్ర కన్వీనర్ సాయి హితేష్ డిమాండ్ చేశారు. శనివారం ఏబీవీపీ నాయకులు పట్టణంలో పాఠశాల తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రైవేటు పాఠశాలలను పరిశీలించి విద్యార్థులను బయటకు పంపించి వేశారు. ఈ సందర్భంగా సాయిహితేష్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యజమాన్యం సెలవు రోజులు అయిన రెండో శనివారం కూడా స్పెషల్ క్లాసుల పేరిట తరగతులు నిర్వ హిస్తూ విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారని విమర్శించారు. అలాగే ఏఐఎస్ఎఫ్ నాయకులు మాధవ్, నరసింహ మండలంలోని నాలుగు ప్రైవేటు పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమాల్లో ఏబీవీపీ నాయకులు రాజు, రెడ్డిమణి, అభిలాష్, పద్మనాభ, శ్రీశాంత్, గౌతమ్ పాల్గొన్నారు.రెండో శనివారం పాఠశాలలను నిర్వహిస్తున్న పాఠశాలల వద్ద ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు.

బండకిందతాండాలో 10 జీవాలు మృతి



మృత్యువాత పడిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

పెద్దమండ్యం, జూలై 13: జీవాలు బలంగా పెరగడం కోసం తాగించే పెరుగు మందుని పొరపాటున పొలాల్లో గడ్డి నివారణ మందు తాగించడంతో 10 గొర్రెలు మృత్యువాతపడినట్లు పెద్దమండ్యం పశు వైద్యాధికారి ఉస్మాన్ వెల్లడించారు. మండలంలోని రామానాయక్ తండా గ్రామ పంచాయతీ బండకింద తాండాకు చెందిన బొడ్డునాయక్, రమేష్ నాయక్‌లు గొర్రెలు మేపుకుంటు జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి మందలోని 4 గొర్రెలు ఆకస్మికంగా మృత్యువాత పడగా కడుపు ఉబ్బరం, కాళ్లు విదిస్తూ మరో ఏడు గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందు కున్న వెటర్నరీ డాక్టర్ ఉస్మాన్ మిగిలిన గొర్రెలకు వైద్యసేవలందించారు. జీవాలు బలం పెరుదల కోసం తాగించే పెరుగు మందని పొరపాటున పొలాల్లో గడ్డి నివారణ మందు తాగించినట్లు బాధితులు డాక్టర్‌కు వివరించారు. శుక్రవారం సాయంత్రం సంఘటన స్థలా నికి తంబళ్లపల్లి ఏరియా పశువైద్యాధికారిణి సుమిత్ర, పెద్దమండ్యం పశు వైద్యాధికారులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్ సిబ్బంది బండకిందతండాలోని గొర్రెల మందను పరిశీలించారు.

తంబళ్లపల్లెలో కొలువుదీరిన పీర్లు



తంబళ్లపల్లె పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

తంబళ్లపల్లె, జూలై 13: పవిత్ర మొహర్రం సందర్భంగా తంబళ్లపల్లె మండల కేంద్రంలోని పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా పీర్ల చావిడిని రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ముజావర్లు పీర్లను పూలతో అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. పీర్లను దర్శించుకోవాడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంగళవారం వేకువజామున 4 గంటలకు పెద్దపీరు మెరవణి, అగ్ని గుండ ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు మస్తాన్, పీర్ల మాబు తెలిపారు. సోమవారం రాత్రి మొక్కుబడి ఉన్న భక్తులు పీర్లకు భాషకాలు సమర్పించాలని నిర్వాహకులు కోరారు.

కందుకూరులో రేపు పెద్ద పీర్ల మెరవణి



కందుకూరు చావిడిలో కొలువుదీరిన పీర్లు

పెద్దతిప్పసముద్రం జూలై 13 : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని కందుకూరులో ఈ నెల 15న పెద్దపీర్ల మెరవని అత్యంత వైభవంగా జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. కాగా శనివారం గ్రామ పెద్దలు పీర్లను గ్రామ చావిడిలో కొలువుదీర్చారు. ప్రతి ఏటాగ్రామంలో కుల మతాలకు అతీతంగా కందుకూరులో అత్యంత వైభవంగా జరిగే మొహర్రం పండుగను తిలకించేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కందుకూరులో జరిగే మొహర్రం పండుగను తిలకించేందుకు భక్తులు అదిక సంఖ్యలో హాజరవుతారని గ్రామస్థులు తెలిపారు. ఇందులో పెద్దపీర్ల మెరవనికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.